www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -275 శనివారం 10 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

### చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా : వివాదాలపై రేవంత్ రెడ్డి కీలక సూచన

**రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకుందామని వ్యాఖ్య**

**కోర్టుల్లో కాకుండా మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామని స్పష్టీకరణ**

**ఏపీ ఒక అడుగు వేస్తే, తెలంగాణ పది అడుగులు వేస్తుందన్న రేవంత్ రెడ్డి**

**రంగారెడ్డి జనవరి 9 ప్రజావినికిడి**

నదీజలాల విషయంలో పక్క రాష్ట్రాలతో వివాదాలు కోరుకోవడం లేదని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నదీ జలాలకు సంబంధించి పంచాయతీ కావాలా..! నీళ్లు కావాలా..! అని అడిగితే తెలంగాణ రాష్ట్రానికి నీళ్లు కావాలని కోరుకుంటామని చెప్పారు. కృష్ణా జలాల విషయంపై కూర్చొని మాట్లాడుకుందామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు అడ్డంకులు సృష్టించొద్దని కోరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంమిగతా 2లో...




## ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

### కాంగ్రెస్ ప్రభుత్వానికి కెటిఆర్ హెచ్చరిక



హైదరాబాద్,**జనవరి 9 ప్రజావినికిడి** మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ భూములపై రేవంత్ సర్కార్ కుట్రల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. దేశంలో మైనార్టీల సంరక్షకుడినని చెప్పుకునే రాహుల్ గాంధీ.. ఉర్దూ యూనివర్సిటీ భూములను అన్యాక్రాంతం చేయడమే కాపాడటమా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ విద్యార్థులు సమావేశమయ్యారు. యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూమిపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చి చదువుకుంటున్న మైనార్టీ విద్యార్థుల యూనివర్సిటీని నిర్వీర్యం చేయడమే మీ సంరక్షణనా అని ప్రశ్నించారు. దీనిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. మీరు చెబుతున్న మొహబ్బత్ కి దుకాణం ఇదేనా అని ప్రశ్నించారు. విద్యార్థులను వారి భూములనుమిగతా 2లో...

## ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

**రెండు విడతలుగా ఏప్రిల్ 2 వరకు పార్లమెంటు సమావేశాలు కొనసాగింపు**

**అరుదుగా ఆదివారం రోజున ఫిబ్రవరి 1న బడ్జెట్ సమర్పణ**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సభ ప్రారంభం**

**షెడ్యూల్ వెల్లడించిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

**ఢిల్లీ జనవరి 09:**
2026 సంవత్సరానికి సంబంధించిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ ఖరారైంది. జనవరి 28 నుంచి ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈసారి కేంద్ర బడ్జెట్‌ను ఆదివారం రోజున ప్రవేశపెట్టే అవకాశం ఉండటం ఈ సమావేశాల ప్రత్యేకతగా నిలవనుంది. రెండు విడతలుగా సాగే ఈ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి.మిగతా 2లో...



## జల జగడాలు వద్దు

**తెలుగుజాతి ప్రయోజనాలే ముఖ్యం**

**2027 మార్చిలోగా 'పోలవరం' పూర్తి**

**రాయవరం సభలో ఏపీ సీఎం చంద్రబాబు**



రాజమహేంద్రవరం : 'సముద్రంలో కలిసే నీళ్ల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య గొడవలు ఎందుకు? నీళ్లు వద్దా గొడవలే కావాలని కొందరు బయల్దేరారు. కొందరు రాయలసీమ ఎత్తిపోతల అంటూ వివాదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. నాకు గొడవలు కాదు తెలుగు జాతి ప్రయోజనాలు కావాలి. పోలవరం పూర్తయితే ఆ నీళ్లు తెలంగాణ కూడా వాడుకునే అవకాశం ఉంటుంది. వివాదాల వల్ల ఎలాంటి ఉపయోగమూ లేదు' అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో ఆయన శుక్రవారం పర్యటించారు. తొలుత రాయవరం గ్రామంలో సర్వే చేసిన పంట భూములను పరిశీలించారుమిగతా 2లో...

## రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

**ఇడి చర్యలపై మమతా నిరసన ప్రదర్శన**

**మమతా బెనర్జీ తీరుపై మండిపడ్డ బిజెపి**

**విచారణకు అడ్డుపడడంపై సుప్రీంలో ఇడి పిటిషన్**

కోల్‌కతా**జనవరి 9 ప్రజావినికిడి** :ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ , దాని సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ జైన్‌పై ఈడీ దాడుల వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై శుక్రవారం నాడు కేంద్రం, పశ్చిమబెంగాల్ ప్రభుత్వం మధ్య ఘర్షణ మరింత తీవ్రమైంది. 2లో...



## సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

**సైబర్ మిత్ర పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు**

**బాధితులు 1930కు ఫోన్ చేయాలన్న కమిషనర్ సజ్జన్నార్**

హైదరాబాద్,**జనవరి 9 ప్రజావినికిడి**

సైబర్ నేరాల బాధితులకు హైదరాబాద్ పోలీసులు ఎల్లప్పుడు అండగా ఉంటారని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. శుక్రవారం నాడు హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో సైబర్ మిత్ర పేరుతో రూపొందించిన ప్రత్యేక విభాగాన్ని సజ్జనార్ ప్రారంభించారు. అనంతరం సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లకు చిక్కిన బాధితులకు ఈ సెల్ ఎంతో సహాయంగా ఉంటుందన్నారు.మిగతా 2లో...






## 'పున మార్గం' ఎఫెక్ట్...

**భద్రతా బలగాల ముందు లొంగిపోయిన 63 మంది మావోయిస్టులు**

**వీరిలో రూ.1.19 కోట్ల రివార్డులు ఉన్న 36 మంది**

**లొంగిపోయిన వారిలో కీలక డివిజనల్ కమిటీ సభ్యులు**

బస్తర్ **జనవరి 9 ప్రజావినికిడి**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు ఉద్యమానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం దంతెవాడలో జరిగిన ఒక కార్యక్రమంలో 18 మంది మహిళలు సహా మొత్తం 63 మంది మావోయిస్టులు భద్రతా బలగాల ముందు లొంగిపోయారు. వీరిలో 36 మందిపై మొత్తం రూ.1.19 కోట్ల రివార్డు ఉండటం గమనార్హం.మిగతా 2లో...

## విద్వేషాలు రేపితే ఎరిపారేస్తా



**అవాస్తవాలు వైరల్ చేస్తూ చూస్తూ ఊరుకోను**

**శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలి**

**పట్టణ పారిశుద్ధ్యంపై మున్సిపల్ సిబ్బంది శ్రద్ధ పెట్టాలి**

**పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు ప్రారంభించిన పవన్ కళ్యాణ్**

**సంక్రాంతి అందరి పండగగా జరుపుకోవాలని పిలుపు**

కాకినాడ**జనవరి 9 ప్రజావినికిడి**


పపితాపురంలో ఏ చిన్న సంఘటన జరిగినా వైరల్ చేస్తున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. పిఠాపురంలో కొబ్బరాకు, తాటాకు పడినా ఏదో జరిగిందని ప్రచారం చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. అవాస్తవాలను వైరల్ చేయడం మానుకోవాలని హితవు పలికారు. పిఠాపురంలో నిర్వహించిన 'పీఠికాపుర సంక్రాంతి మహోత్సవాలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మిగతా 2లో...

## టెట్ ఫలితాలు వచ్చేశాయ్!

**ఏపీ టెట్ 2025 ఫలితాలు అధికారికంగా విడుదల**

**మొత్తం 39.27 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు**

**పరీక్షకు హాజరైన వారిలో 97,560 మంది అర్హత**




విజయవాడ,**జనవరి 9 ప్రజావినికిడి**

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్-2025) ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ పరీక్షలో మొత్తం 39.27 శాతం మంది అభ్యర్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాది డిసెంబర్ 10 నుంచి 21 వరకు ఈ పరీక్షలను నిర్వహించిన సంగతి తెలిసిందే.మిగతా 2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# జల జగడాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

. అనంతరం రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. ఎటువంటి అవినీతి అక్రమాలకూ తావులేకుండా రైతులకు రాజముద్రతో కూడిన పాస్‌పుస్తకాలను అందిస్తున్నామన్నారు.

రీసర్వే పూర్తి అయిన 6,688 గ్రామాల్లోని భూములకు సంబంధించి 22.33 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గోదావరి పుష్కరాలను వరుసగా మూడోమారు ముఖ్యమంత్రిగా నిర్వహించే అదృష్టం తనకు దక్కిందన్నారు. 2027 మార్చిలోగా పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఏటా మూడు వేల టిఎంసిల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, ఇందులో 300 టీఎంసీలు వాడుకుంటే వచ్చే నష్టం ఏమీ లేదని పేర్కొన్నారు. పోలవరాన్ని ఒక యజ్ఞంగా భావించి పూర్తి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ వైఫల్యం వల్లే ఈ ప్రాజెక్టు పూర్తి కావడంలో జాప్యం జరిగిందన్నారు. గత పాలకుల తప్పిదాల వల్ల రూ.వెయ్యి కోట్లతో డయాఫ్రం వాల్ మళ్లీ కట్టాల్సి వస్తోందన్నారు. పోలవరం ప్రాజెక్టుతో నీటి ఎద్దడి లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. పట్టిసీమ కట్టి కృష్ణా డెల్టాలో వినియోగించుకుందామంటే వ్యతిరేకించారని విమర్శించారు.కృష్ణా డెల్టాలో నీళ్లను పొదుపు చేసి శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి తరలిస్తామన్నారు. కొందరు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికే రెండేళ్లు పట్టిందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టును పిపిపిలో కడుతుంటే ముద్దు కానీ, పిపిపి కింద మెడికల్ కాలేజీలు కడితే వద్దంటున్నారని విమర్శించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నామన్నారు. దేశంలోకొచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం మన రాష్ట్రానికే వచ్చాయని పేర్కొన్నారు. త్రిబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ తరహాలో ప్రధాని మోడీ, పవన్ కల్యాణ్‌తో కలిసి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంతలు లేని రహదారులను తయారు చేస్తున్నామని, రెండు రోజుల్లోనే 40 కిలోమీటర్ల రోడ్డు వేసి రికార్డు సృష్టించామని తెలిపారు.ట్రూ డౌన్ పేరుతో విద్యుత్తు బిల్లుల భారం తగ్గించామన్నారు. రూ.4,500 కోట్లు పెంచుకోమని ఇఆర్‌సి అనుమతి ఇస్తే, ప్రజాప్రయోజనాల దృష్ట్యా వద్దని చెప్పామని తెలిపారు. భవిష్యత్తులోనూ కరెంటు ఛార్జీలు పెంచబోమని మరోమారు స్పష్టం చేస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పేరిట సుపరిపాలన అందించేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. జగ్గన్నపేట ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండగగా ప్రకటించామన్నారు. సంక్రాంతికి కోడి పందేలు సంప్రదాయమే కానీ, జూదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ జి.హరీష్‌మాథూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జల వివాదాలను మనమే పరిష్కరించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

రావిర్యాల్‌లోని ఈ-సిటీలో నెలకొల్పిన సుజెన్ మెడికేర్ ఫ్లూయిడ్స్ తయారీ యూనిట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం ప్రసంగించారు. రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందన్నారు. నీళ్ల వివాదం ముసుగులో రాజకీయ లబ్ది పొందాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు లేదన్నారు. రాజకీయాలకతీతంగా పరిష్కారం కోసం అందరూ సహకరించాలని ప్రతిపక్ష పార్టీలకు విజ్ఞప్తి చేశారు. మన సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుందామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నట్టు ప్రకటించారు. "పక్క రాష్ట్రాలతో తెలంగాణ వివాదాలను కోరుకోవడం లేదు. న్యాయస్థానాల ముందుకు లేదా మరెవరి వద్దనో పంచాయితీ పెట్టుకునే కన్నా కూర్చొని చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలి" అని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, డిండి, ఎస్ఎల్బీసీ, బీమా, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరాల వల్ల పర్యావరణం, సీడబ్ల్యూసీ నుంచి సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు, అనుమతులు కూడా రావడం లేదని, తద్వారా రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని చెప్పారు. రాజకీయ ప్రయోజనా లకన్నా ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం ఆలోచి స్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పోర్టు కనెక్టివిటీ లేని తెలంగాణకు మచిలీపట్నం పోర్టుతో కనెక్టివిటీ కోసం 12 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే కనెక్టివిటీతో సహా అనుమతి అడిగామని, ఆ కనెక్టివిటీని అభివృద్ధి చేయాలంటే పక్క రాష్ట్రం సహకారం అవసరమని చెప్పారు. ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధి చెందాలంటే తెలంగాణ సహకారం అవసరం ఉంటుందని, పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవు తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పరస్పర సహకారాన్ని మాత్రమే కోరుకుంటున్నామని చెప్పారు.

తెలంగాణ సమగ్రాభివృద్ధి కోసం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు భాగాలుగా అభివృద్ధి లక్ష్యలను నిర్దేశిస్తూ గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేశామని వివరించారు. ఇందులో భాగంగా సుజెన్ మెడికేర్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రపంచంలో జర్మనీ, జపాన్, సౌత్ కొరియా, న్యూయార్క్‌తో పోటీ పడాలని సంకల్పించామని, అందులో భాగంగానే యువ పారిశ్రామిక వేత్తలు ప్రారంభించే పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తోందని, బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి దేశంలో తెలంగాణ నుంచి 40 శాతం ఉందని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. జర్మన్ టెక్నాలజీతో దక్షణ భారత దేశంలోనే ఐవీ ఫ్లూయిడ్స్ తయారీలో గొప్ప సంస్థను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రపంచమే మనవైపు చూసేలా ఫార్మా రంగంలో రాణిస్తున్నామన్నారు.

1995 నుంచి 2025 వరకు 30 ఏండ్ల నిరంతర శ్రమ వల్ల హైదరాబాద్ ప్రపంచ నగరాలతో పోటీ పడుతోందని ముఖ్యమంత్రి చెప్పారు. మన దగ్గర చదువుకుని వెళ్లిన వారు గ్లోబల్ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే ప్రయివేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. భారత్ ఫ్యూచర్ సిటీ వల్ల ఇక్కడి భూముల ధరలు పెరుగుతాయని, అభివృద్ధికి అందరూ సహకరించాలని, సహకారం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్వేషాలు రేపితే ఏరిపారేస్తా








(మొదటి పేజీ తరువాయి)

పులివెందులలో సొంత బాబాయ్‌ని చంపినా అది వార్త కాదు.. పిఠాపురంలో స్కూల్ పిల్లలు కొట్టుకున్నా అది పెద్ద వార్త అవుతుంది. పిఠాపురం వచ్చి గొడవలు చేద్దామనుకుంటే ఇక్కడ కూర్చొని ఏరివేస్తాను. గత ప్రభుత్వంలో బూతులు తిట్టడం, కేసులు పెట్టడం చేశారు. పిఠాపురంలో మళ్లీ అలాంటివి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. శాంతి భద్రతల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలి. నా మాటలు మెత్తగా.. చేతలు గట్టిగా ఉంటాయి. నన్ను అన్నా.. పార్టీని అన్నా భరిస్తా. ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే వారిని మాత్రం క్షమించనని ఘాటుగా హెచ్చరించారు. అంతకుముందు పలు స్టాళ్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన సందర్శించారు. పిఠాపురం సంక్రాంతి ఉత్సవాలకు చిరునామా కావాలన్నారు ఈ పండుగ అన్ని మతాలు జరుపుకొనే స్థాయికి ఎదగాలి. తెలంగాణకు ఆంధ్రా ప్రాంత ప్రజల ప్రేమను తీసుకెళ్లాలి. అక్కడి సోదరీమణులను సంక్రాంతికి ఆహ్వానించి.. వారికి గోదావరి జిల్లాల ఆతిథ్యాన్ని రుచి చూపాలి. సంక్రాంతి అంటే కోడిపందేలు, జూదాలు మాత్రమే కాదు. ఈ సరదాలను నేను కాదనడం లేదు.. చేసేవాళ్లు చేసుకోండి. కానీ వాటికే పరిమితం కాకూడదన్నారు. పిఠాపురం.. దేశానికి చాలా కీలకమైన శక్తిపీఠం. శ్రీపాద శ్రీవల్లభుడు వెలసిన నేల ఇది. ఇక్కడి నుంచి నేను పోటీ చేయడం భగవంతుడి సంకల్పం. పిఠాపురం అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం. నన్ను బలోపేతం చేస్తే మరింతగా పనిచేస్తా. అధికారం ఉన్నా లేకపోయినా ఆఖరిశ్వాస వరకు ఇక్కడి ప్రజల కోసం పనిచేస్తాను. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా అవసరం. కూటమి నేతలు పొత్తులను బలహీనం చేసే ప్రయత్నం చేయొద్దు. ప్రజలను ఎలా కాపాడాలి అనే అంశంపై నాకు, చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని పవన్ అన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. తన సొంత నియోజకవర్గం కాకినాడ జిల్లా పిఠాపురంలో పర్యటిస్తున్నారు.. అయితే, స్థానిక అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు పవన్.. పిఠాపురం మున్సిపల్ కమిషనర్‌తో పాటు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం కమిషనర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, అపరిశుభ్ర పరిస్థితులను చూసి పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలు ఇంత చెత్తగా ఉంటే అక్కడి ప్రజల జీవన ప్రమాణాలు ఎలా ఉంటాయి? నేను అయితే ఇలాంటి చోట ఒక్క రోజు కూడా ఉండలేను. అసలు నేను చీపురు పట్టి రోడ్లు తుడవాలా? అంటూ అధికారులను నిలదీశారు. ఇక, పిఠాపురంలో పారిశుధ్య నిర్వహణ విఫలమవుతున్న నేపథ్యంలో.. 'గుడ్ మార్నింగ్ పిఠాపురం' కార్యక్రమాన్ని కూడా తానే స్వయంగా నిర్వహించాలా? అని పవన్ తీవ్రంగా ప్రశ్నించారు. ప్రజలకు కనీస సదుపాయాలు అందించడంలో మున్సిపల్ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. పిఠాపురం అభివృద్ధి కోసం పాడా పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకటించినా, దాని అమలు విషయంలో వేగం లేకపోతే ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. అవసరమైతే రాజకీయ-పరమైన అడ్మినిస్ట్రేషన్ నిర్ణయాలు తీసుకోలేరా? అభివృద్ధి కోసం ప్రభుత్వం గట్టి అడుగులు వేయొద్దా? అని అధికార పార్టీ నేతలను, యంత్రాంగాన్ని నిలదీశారు.కాలనీల్లో నడుచుకుంటూ సమస్యలు తెలుసుకున్నారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. కేవలం సమీక్షలకే పరిమితం కాకుండా, పవన్ కల్యాణ్ పిఠాపురం కాలనీల్లో నడుచుకుంటూ వెళ్లి స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, చెత్త నిర్వహణ, మౌలిక వసతుల కొరతపై ప్రజలు చెప్పిన అంశాలను ఆయన నోట్ చేసుకున్నారు. అయితే, పిఠాపురం పారిశుధ్య వ్యవస్థను వెంటనే మెరుగుపర్చాలని, అధికార యంత్రాంగం ప్రజల అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు.

# సైబర్ నేరగాళ్ల బాధితులకు అండ

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో సైబర్ క్రైమ్‌పై హెల్ప్ డెస్క్ ఏర్పాటైందని వివరించారు. సైబర్ క్రైమ్‌ల్లో బాధితుల సంఖ్య పెరుగుతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే 1930కి ఫోన్ చేయాలని బాధితులకు సూచించారు. సైబర్ దాడికి గురైతే మ్యూల్ ఖాతాలకు నగదు బదిలీ అయి.. విత్ డ్రా చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే గో÷-డలెన్ అవర్‌ను వినియోగించుకోవాలంటూ బాధితులకు ఆయన కీలక సూచన చేశారు. నేరం జరిగిన గంట లోపు ఫిర్యాదు చేస్తే నగదు ఫ్రీజ్ అవుతుందన్నారు. సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కి ఫోన్ చేసి.. ఫిర్యాదు చేస్తే సరిపోదన్నారు. అనంతరం స్థానిక పోలీసులకు సైతం




ఫిర్యాదు చేయాల్సి ఉందని చెప్పారు. కానీ చాలా మందికి ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియడం లేదన్నారు. నూతన విధానం ద్వారా బాధితులు తమ ఫిర్యాదును పోస్ట్ ద్వారా లేదా పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్ ద్వారా పంపవచ్చన్నారు. సైబర్ మిత్ర సెల్‌లోని పోలీసులు.. బాధితులకు ఫోన్ చేసి ఫిర్యాదు ఎలా రాయాలి? ఏయే సెక్షన్లు వర్తిస్తాయనే విషయాలపై అవగాహన కల్పిస్తారు. ఇంటి నుంచే ఎఫ్ఐఆర్ పొందే సౌకర్యాన్ని కల్పించడం ద్వారా 100 శాతం కేసుల నమోదును లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ట్రయిల్‌లో భాగంగా 86 మందికి ఫోన్ చేశామని.. వారి నుంచి మంచి స్పందన వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సైబర్ నేరానికి గురికాకుండా జాగ్రత్తగా ఉండాలంటూ ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరాలపై తరచూ ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారంటూ హైదరాబాద్ పోలీసులను నగర సీపీ సజ్జనార్ ప్రశంసించారు.

# 'పున మార్గం' ఎఫెక్ట్...

(మొదటి పేజీ తరువాయి)

దంతెవాడ జిల్లా రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) కార్యాలయంలో ఈ లొంగుబాటు కార్యక్రమం జరిగింది. హింసను వీడి జనజీవన స్రవంతిలో కలిసేలా మావోయిస్టులను ప్రోత్సహించేందుకు దంతెవాడ పోలీసులు చేపట్టిన 'పున మర్గం' (పునరావాసం – పునరుజ్జీవనం) ప్రచారమే ఈ భారీ లొంగుబాటుకు కారణమని అధికారులు తెలిపారు. డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్పీఎఫ్ బలగాలు వీరిని లొంగిపోయేలా చేయడంలో కీలక పాత్ర పోషించాయి.లొంగిపోయిన వారిలో దర్భా డివిజన్, దక్షణ బస్తర్, పశ్చిమ బస్తర్, మాడ్ డివిజన్‌లతో పాటు ఒడిశాలో పనిచేసిన వారు కూడా ఉన్నారు. వీరిలో డివిజనల్ కమిటీ సభ్యులు (డీవీసీఎమ్) మోహన్ కడ్తీ, సుమిత్రా కడ్తీ, పీపుల్స్ పార్టీ కమిటీ సభ్యురాలు (పీపీసీఎమ్) హంగీ వంటి కీలక నేతలు ఉన్నారు. వీరిపై గతంలో అనేక దాడులు, హత్యలు, ఐఈడీ పేలుళ్లు, ఆస్తుల ధ్వంసం వంటి కేసులు నమోదై ఉన్నాయి.ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ నక్సల్ పునరావాస విధానం ప్రకారం, లొంగిపోయిన వారికి రూ. 50,000 తక్షణ సహాయంతో పాటు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ, వ్యవసాయ భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని అధికారులు వివరించారు. ఈ లొంగుబాటు బస్తర్‌ను నక్సల్ రహిత ప్రాంతంగా మార్చే ప్రయత్నాల్లో ఒక పెద్ద విజయమని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పట్టిలింగం పేర్కొన్నారు.

## ఈ నెల 28 నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు, పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారని మంత్రి కిరణ్ రిజిజు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. "2026 బడ్జెట్ సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు జరుగుతాయి. తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13తో ముగుస్తాయి. అనంతరం మార్చి 9న సభ తిరిగి సమావేశమవుతుంది. అర్థవంతమైన చర్చలకు, ప్రజలు కేంద్రంగా సాగే పాలనకు ఈ సమావేశాలు అత్యంత కీలకం" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.నివేదికల ప్రకారం, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఫిబ్రవరి 1 ఆదివారం కావడం గమనార్హం. పార్లమెంట్ చరిత్రలో ఆదివారం రోజున బడ్జెట్ ప్రవేశపెట్టడం చాలా అరుదు. దీనికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఇక బడ్జెట్‌కు ముందు, దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరును సమీక్షంచే ఆర్థిక సర్వేను జనవరి 29 లేదా 30న పార్లమెంట్ ఉభయ సభల ముందు ఉంచనున్నారు.ఈ బడ్జెట్ సమావేశాలను రెండు దశల్లో నిర్వహించనున్నారు. తొలి విడత జనవరి 28 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరుగుతుంది. ఆ తర్వాత సభకు విరామం ఉంటుంది. ఈ విరామ సమయంలో వివిధ మంత్రిత్వ శాఖలకు చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘాలు బడ్జెట్ పద్దులు, వివిధ పథకాలకు కేటాయింపులపై లోతైన సమీక్ష జరుపుతాయి. అనంతరం మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభమై ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. ఈ దశలో స్థాయీ సంఘాల నివేదికలపై చర్చించి, తుది ఆమోదం తెలుపుతారు.సంప్రదాయం ప్రకారం, సమావేశాల మొదటి రోజైన జనవరి 28న పార్లమెంట్ ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఈ ప్రసంగంలో ప్రభుత్వ విధానాలు, ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలను ఆమె వివరిస్తారు. ఆర్థిక వృద్ధి, ద్రవ్యలోటు నియంత్రణ, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమావేశాలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పన్నులు, ప్రభుత్వ వ్యయం, విధానపరమైన సంస్కరణలపై అధికార, విపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. రాష్ట్రపతి ఆమోదంతో సమావేశాల నిర్వహణకు అధికారికంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

# రచ్చకెక్కిన బెంగాల్ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి)



అవినీతిలో కూరుకుపోయారంటూ తనపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు, ఈడీ చర్యలపై ముఖ్యమంత్రి మమతాబెనర్జీ.. కోల్‌కతా రోడ్లపైకి వచ్చి భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు ఈడీ సైతం కోల్‌కతా హైకోర్టు విచారణపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది.ప్యాక్‌పై ఈడీ దాడులకు సంబంధించి దాఖలైన పలు పిటిషన్లపై కోల్‌కతా హైకోర్టు జస్టిస్ సువ్ర ఘోష్ విచారణ చేపట్టినప్పటికీ భారీగా జనం హాజరుకావడంతో ఆయన కోర్టు రూమ్‌ను విడిచిపెట్టి వెళ్లిపోయారు. గత వారంరోజులుగా కోర్టుకు సెలవులు ఉండగా.. ఈ అంశంపై వచ్చే బుధవారం నాడు తిరిగి విచారణ చేపట్టనున్నారు. కోల్‌కతా హైకోర్టులో కేసు విచారణ వాయిదా పడటంతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్‌ను ఈడీ శుక్రవారం నాడు ఆశ్రయించింది. తక్షణ విచారణ కోసం ధర్మాసనం ఏర్పాటు చేయాలని కోరింది. కాగా, హైకోర్టులో శుక్రవారం విచారణ సందర్భంగా ఈడీ తమ వాదన వినిపిస్తూ, ఐప్యాక్ కార్యాలయం, జైన్ నివాసంలో తాము సోదాలు నిర్వహిస్తుండగా అధికారులతో అడ్డగించడం ద్వారా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించింది. దీనిపై జైన్, తృణమూల్ కాంగ్రెస్ కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లను సీజ్ చేయాలని ఈడీ ప్రయత్నించిందని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఒకవైపు కోర్టు విచారణ జరుగుతుండగా మరోవైపు ఈడీ దాడులకు నిరసనగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ జాదవ్‌పూర్ నుంచి హజ్రా క్రాసింగ్ వరకూ 5 కిలోమీటర్ల మేరకు పాదయాత్ర నిర్వహించారు. పెద్దఎత్తున కార్యకర్తలు, పార్టీ నేతలు ఇందులో పాల్గొన్నారు. ఏం చేసైనా సరే పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో గెలవాలని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని మమతా బెనర్జీ, తృణమూల్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అయితే ఈ ఆరోపణలను బీజేపీ తోసిపుచ్చింది. టీఎంసీ చీఫ్ అవినీతి ఊబిలో కూరుకుపోయారని, ఈడీ అధికారులను బెదిరిస్తున్నారని బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. మమతా చర్యల వెనుక అనేక అనుమానాలు ఉన్నాయని.. తనను, తమ పార్టీని చిక్కుల్లోకి నెట్టే కీలకమైన సమాచారాన్ని తొలగించేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ విమర్శించారు.

# టెట్ ఫలితాలు వచ్చేశాయ్!

(మొదటి పేజీ తరువాయి)ఏపీ టెట్ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి ఫలితాల వివరాలను మీడియాకు వెల్లడించారు. టెట్‌కు మొత్తం 2,71,692 మంది దరఖాస్తు చేసుకోగా, 2,48,427 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 97,560 మంది అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లో ఉత్తీర్ణత శాతం కాస్త మెరుగ్గా నమోదైంది. పరీక్షకు హాజరైన 31,886 మంది ఇన్‌సర్వీస్ టీచర్లలో 15,239 మంది (47.82 శాతం) పాసయ్యారు.ప్రాథమిక కీ విడుదల తర్వాత అభ్యర్థుల నుంచి అందిన అభ్యంతరాలను నిపుణుల కమిటీతో పరిశీలించి, తుది కీతో పాటు ఫలితాలను ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను ఖజ్‌వ్.ఖజూఏటంం.ఙఅ ... ఏంవ.ఖజూ.స్త్రశీజ.ఙఅ వంటి అధికారిక వెబ్‌సైట్ల ద్వారా తెలుసుకోవచ్చు. వీటితో పాటు 9552300009 అనే వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ పంపి కూడా ఫలితాలను పొందవచ్చని సూచించారు.

# ఉర్దూ వర్సిటీ భూముల జోలికి రావద్దు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొని రోడ్డుమీద వేయడమేనా? అని నిలదీశారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్న సమస్యలపై రాహుల్ గాంధీ మాట్లాడాలి కానీ వారి భూములు గుంజుకుంటున్న తమ ప్రభుత్వంపై స్పందించకపోవడం దారుణమని కేటీఆర్ విమర్శించారు. యూనివర్సిటీలో ఉన్న భూములు ఖాళీగా ఉన్నవి కావు భవిష్యత్తు విస్తరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సెంట్రల్ యూనివర్సిటీ ప్రతిష్టను తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని మండిపడ్డారు. గతంలో ఇదే యూనివర్సిటీ ప్రజా అవసరాల కోసం హైదరాబాద్ నగరం కోసం 32 ఎకరాలు ఔటర్ రింగ్ రోడ్డు కోసం ఇచ్చారని, ఖాజాగూడ నుంచి నానక్ రామ్ గూడ కు లింక్ రోడ్డు కోసం ఏడెకరాల స్థలాన్ని యునివర్సిటీ భూమి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఏనాడు కూడా హైదరాబాద్ నగర ప్రయోజనాల కోసం ప్రజాప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు భూసేకరణను ఏనాడు వ్యతిరేకించలేదని చెప్పారు. గతంలో తెలంగాణలో జరిగిన ఉద్యమం వల్లనే హైదరాబాద్‌లో సెంట్రల్ యూనివర్సిటీ, ఉర్దూ యూనివర్సిటీ ఏర్పడిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమాలు త్యాగాల ఆధారంగా ఏర్పడిన యూనివర్సిటీని రియల్ ఎస్టేట్ కోసం వాడటం దారుణమని మండిపడ్డారు. గతంలో మేము నిజాం కాలేజీలో హాస్టల్ లేదు అంటే ప్రభుత్వ నిధులతో హాస్టల్ కట్టించామని గుర్తుచేశారు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీకి అండగా ఉంటామని స్పష్టం చేశారు. కావలసిన విస్తరణ సౌకర్యాలకు నిధులు కూడా కేటాయించి అండగా నిలబడతామని భరోసానిచ్చారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శనివారం 10 జనవరి 2026

# రిజర్వాయర్లు పూర్తి కాకముందే ప్రాజెక్టును ప్రారంభించిన మాజీ సీఎం కేసీఆర్

## బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్

**ప్రజావినికిడి,(హిమాయత్ నగర్):**
పాలమూరును పండబెట్టి డిండికి అంత ఆత్రుత ఎందుకని నల్గొండ మంత్రులకు వున్న ధ్యాస పాలమూరు మంత్రులకు లేదా అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. హైదరాబాద్లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.
పాలమూరు ఎత్తిపోతలకు జూరాల నుంచి నీటిని నింపి ఉంటే సమస్య ఉండేది కాదని,శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి మొదట రోజుకు 2 టిఎంసీలు నీటిని ఉంచి,ఆ తరవాత రోజుకు 1.5 టిఎంసీలు నీటి విడుదలకు ప్రాజెక్టు పనులు ప్రారంభించారని దుయ్యబట్టారు.
లక్ష్మదేవిపల్లి వద్ద 2.5 టిఎంసీ నీటిని ఈ రిజర్వాయర్ల ద్వారా వాడుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 2015 జులై 11న కరివెన వద్ద ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు.ఆలు లేదు చూలు లేదు అల్లుడి పేరు సోమలింగం అన్నట్లు 2023లో ఎలక్షన్ స్టంట్ కోసం అప్పటి సీఎం కేసీఆర్ రిజర్వాయర్లు పాముకు పూర్తి కాకముందే నీళ్లు అప్పటికప్పుడు నింపుతున్నట్లు ఆగమేఘాల మీద ప్రాజెక్టును ఓపెనింగ్ చేసి జనాలను మభ్య పెట్టడంపై విమర్శించారు. పాలమూరు బిడ్డ



ముఖ్యమంత్రిగా ఉంటే కూడా పాలమూరుకు దక్కాల్సిన నీటిపై నల్గొండ మంత్రులు లోలోపలే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు.నల్గొండ జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి నీటిపారుదల శాఖా మంత్రి కదా ఆయనకు అన్ని ప్రాజెక్టులు సమానమే కదా మా జిల్లా ప్రాజెక్టులు పూర్తి కాకముందే మా జిల్లాకు వచ్చిన నీటిని మీ జిల్లా ప్రాజెక్టులకు తరలించాలనుకోవటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.గతంలో డిండి ప్రాజెక్టుకు నీళ్ల విడుదలపై లేఖ రాసిన మంత్రి జూపల్లి కృష్ణారావు మౌనం విడాలని విజ్ఞప్తి చేశారు.పాలమూరుకు వచ్చే అరకొర నీటిని కూడా తరలించుకుపోతుంటే ఇక పాలమూరు ప్రజలు జీవితకాలం వలసలు పోతూ ఇతర ప్రాంతాల్లో కూలీలుగా మిగిలాల్సిందేనా అని ద్వజమెత్తారు. పాలమూరు రైతుల పక్షన బీసీ పొలిటికల్ జేఏసీ పెద్ద ఎత్తున ఆందోళన,ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోటూరి రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు రేనట్ల మల్లేష్,వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ గూడుషా,ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, కొల్లాపూర్ నియోజక కన్వీనర్ యశ్వంత్, మొయినాబాద్ మండల అధ్యక్షులు శ్రీధర్,బాలేమియా తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

## :మల్ రెడ్డి రాంరెడ్డి

**ఈ విషయమై స్థానికులతో కలిసి మంత్రి శ్రీధర్ బాబుకు విన్నవించిన మల్ రెడ్డి రాంరెడ్డి**

**సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ**



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
ఎల్బీనగర్ డివిజన్‌గా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి కోరారు.ఎల్బీనగర్ ను ఇతర డివిజన్లలో కలపకుండా ఎల్బీనగర్ ను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి,రంగారెడ్డి జిల్లా ఇంఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఎల్బీనగర్ వాసులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ లో కొంత భాగాన్ని ఇతర డివిజన్ లో కలిపిన విషయమై ఎల్బీనగర్ వాసులు తనను కలిసి విన్నవించారని తెలిపారు.ఈ విషయమై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు. ఎల్బీనగర్ డివిజన్‌గా ఏర్పాటు చేసే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మంత్రి శ్రీధర్ బాబు హామినిచ్చారని తెలిపారు.మంత్రిని కలిసిన వారిలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి,మాజీ డైరెక్టర్ ఆడాల రమేష్, స్థానికులు నిమ్మలూరి శ్రీనివాస్,ఎండీ జానిమియా,అల్లి భాస్కర్ యాదవ్, గుండెల కిరణ్ కుమార్, రాజ్ కుమార్, చంద్రశేఖర్,మెట్టు జీవన్ రెడ్డి,అరుణ్, అంబేద్కర్,చంద్ర శేఖర్ రెడ్డి,గుర్రం సతీష్,రాజు గౌడ్,ఆనంద్,కన్నా, జయంత్,కిట్టు, భానుచందర్,గోపి, అస్లాం,గణేష్ తదితరులు ఉన్నారు

## షాద్ నగర్ ప్రభుత్వ బాలుర గిరిజన సంక్షమ కళాశాలలో

# నూకలు, రాళ్లు కలిసిన బియ్యం

**'సన్న బియ్యం ఇస్తున్నాం' అన్న ప్రభుత్వ వాదన అబద్ధాల కుప్ప!**

**తక్షణమే నాణ్యమైన వసతులు కల్పించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం**

**రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న...విద్యాశాఖ మంత్రి కేటాయించకపోవడం సిగ్గుచేటు**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా, సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ హెచ్చరిక**




**ప్రజావినికిడి,(షాద్‌నగర్):**నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ బాలుర గిరిజన సంక్షమ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత అత్యంత దారుణంగా మారిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ తీవ్రంగా విమర్శించారు. విద్యార్థులకు అందించాల్సిన భోజనంలో నూకలు, రాళ్లు కలిసిన బియ్యం ఇస్తూ ప్రభుత్వ యంత్రాంగం వారి ఆరోగ్యంతో బహిరంగంగా చెలగాటం ఆడుతోందని ఆయన మండిపడ్డారు.శుక్రవారం హైదరాబాద్ రోడ్డు సమీపంలో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలుర కళాశాలను ఏఐఎస్ఎఫ్ నేతలు సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులను అడిగి తెలుసుకోగా, నెలల తరబడి నాసిరకమైన నూకల బియ్యమే అందిస్తున్నట్లు వారు వాపోయారు.ఈ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి మాట్లాడుతూ...140 మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నాం. నాసిరకమైన నూకల బియ్యం కారణంగా ఆరోగ్యం దెబ్బతింటోంది.చదువుపై ఏకాగ్రత తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశాడు.
ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ.,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ ప్రకటనలకే పరిమితమవుతుందని, కానీ క్షేత్రస్థాయిలో మాత్రం గిరిజన కళాశాలల్లో నాణ్యతలేని, తినలేని ఆహారాన్ని విద్యార్థుల ముందుకు నెట్టుతోందని మండిపడ్డారు.రెండు సంవత్సరాలు గడిచినా విద్యాశాఖకు మంత్రి నియమించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యాశాఖను గాలికి వదిలేసి గిరిజన విద్యార్థుల భవిష్యత్తును చీకట్లోకి నెట్టారని ఆరోపించారు.విద్యాబుద్ధులు నేర్పి గొప్ప ప్రయోజకులుగా తీర్చిదిద్దుతారని ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ గిరిజన పాఠశాలల్లో చేర్పిస్తే, ఇక్కడ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ విద్యార్థుల భవిష్యత్తే అంధకారంలోకి నెట్టబడుతోందని,వారి ఆరోగ్య భద్రతను కూడా బలహీనపరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం లేకుండా, మౌలిక వసతులు లేకుండా విద్యార్థులు ఎలా ఉత్తీర్ణత సాధిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ప్రభుత్వం తక్షణమే గిరిజన కళాశాలలకు నాణ్యమైన సన్న బియ్యం, పరిశుభ్రమైన వంట సామాగ్రి, తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ఉద్యమాలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని గట్టిగా హెచ్చరించారు.

## ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి

# మానవ ఆరోగ్యానికి ముప్పు..

**శంషాబాద్ జోనల్ కమిషనర్ కే.చంద్రకళ..**







**ప్రజావినికిడి, (శంషాబాద్):జనవరి 9,**ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ వ్యర్థాల కంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి మానవ ఆరోగ్యానికి ముప్పుగా పరిణమించాయని శంషాబాద్ జోనల్ కమిషనర్ కే చంద్రకళ అన్నారు.రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఈ వేస్ట్ సేకరణ అవగాహన పరిశుభ్రమైన కాలుష్య రహిత నగరాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం చేపట్టిన స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా, శంషాబాద్ జోన్ పరిధిలో ఈ-వేస్ట్ ఎలక్ట్రానిక్ వ్యర్థాలసేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ జోనల్ కమిషనర్ కె.చంద్రకళ పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రస్తుత కాలంలో ప్లాస్టిక్ వ్యర్థాల కంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి మానవ ఆరోగ్యానికి పెద్ద ముప్పుగా పరిణమించాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఇంటి వద్ద పేరుకుపోయిన పాత మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు,కంప్యూటర్ భాగాలు ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను ఇష్టానుసారంగా పారవేయకుండా, మున్సిపల్ యంత్రాంగం ఏర్పాటు చేసిన ప్రత్యేక సేకరణ కేంద్రాలకు అప్పగించాలని ఆమె కోరారు.ఈ-వేస్ట్ నిర్వహణ పర్యావరణాన్ని రక్షంచేందుకు శాస్త్రీయ పద్ధతిలో ఈ-వేస్ట్ రీసైక్లింగ్ చేయాల్సిన అవసరాన్ని అధికారులకు,ప్రజలకు వివరించారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటిలోని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలని తెలిపారు.
డీఈఈ,ఏఎంసీ రిసోర్స్ పర్సన్స్ ఆర్.పి.ఎస్ క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ,డీఈఈ ఎస్.డబ్ల్యూ.ఎం, రిసోర్స్ పర్సన్స్ ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొని,ఈ-వేస్ట్ సేకరణ ప్రక్రియపై స్థానికులకు అవగాహన కల్పించారు.

# సీఎం చేతుల మీదుగా అల్ట్రా ప్రీమియం ఓడియన్ మాల్ ప్రారంభం

**ప్రజావినికిడి, (హైదరాబాద్):**
ప్రపంచ స్థాయి షాపింగ్,డైనింగ్, వినోదాల సమ్మేళనంగా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఏర్పాటు చేసిన అల్ట్రా ప్రీమియం ఓడియన్ మాల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓడియన్ మాల్ డైరెక్టర్ తుల్లా విజయేందర్ గౌడ్ మాట్లాడుతూ, ఓడియన్ మాల్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు ఒక కొత్త అధ్యాయాన్ని తీసుకొస్తుందని తెలిపారు.ఈ మాల్ ద్వారా మొదటిసారిగా వినూత్న కాన్సెప్ట్‌లు ఈ ప్రాంతానికి పరిచయం కానున్నాయన్నారు. సినిమా సంస్కృతికి చిరునామాగా నిలిచిన ఈ ప్రాంతంలో మొట్టమొదటి మల్టీప్లెక్సా ఐనాక్స్ ఆధ్వర్యంలో అత్యాధునిక సినిమా థియేటర్‌ను ఓడియన్ మాల్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో తొలి కృత్రిమ మేధ ఇంటిగ్రేటెడ్ మాల్గా ఓడియన్ మాల్ నిలవనుందన్నారు. ఆపరేషనల్ ఎఫిషియెన్సీ, సందర్శకుల నావిగేషన్, భద్రతను మెరుగుపరిచే స్మార్ట్ సిస్టమ్‌లను అమలు చేయడం ద్వారా రిటైల్ మౌలిక వసతుల రంగంలో ఓడియన్ మాల్ ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పనుందన్నారు.
ఈ సందర్భంగా ఓడియన్ మాల్ ప్రమోటర్లు అమర్‌నాథ్ వుప్పలంచ మాట్లాడుతూ అత్యుత్తమ షాపింగ్, లైఫ్‌స్టైల్ గమ్య స్థానాన్ని నిర్మించాలన్న దృష్టితో ఓడియన్ మాల్ ఏర్పాటు చేశామన్నారు. నాణ్యత,నవీనత, వినియోగదారుల సంతృప్తే మా లక్ష్యమన్నారు.రిటైల్, వినోదం,సామాజిక అనుభవాలను ఒకే వేదికపై సమన్వయం చేసే వేదికను నగరానికి అందించినందుకు సంతోషంగా ఉందన్నారు.ఆధునిక సదుపాయాలు, వినియోగదారుల అనుభవాలపై ప్రత్యేక దృష్టితో ఓడియన్ మాల్ హైదరాబాద్ రిటైల్,లైఫ్‌స్టైల్ రంగానికి కొత్త నిర్వచనం ఇవ్వడమే కాకుండా ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో ఒక ప్రతిష్ఠాత్మక ల్యాండ్‌మార్క్‌గా నిలవనుందని తెలిపారు.ఈ మాల్ నగరవాసులకు అసాధారణమైన షాపింగ్ అనుభూతిని అందించనుంది. మారుతున్న నగర జీవనశైలిని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ మాల్ అన్ని వయసుల వారికి ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన షాపింగ్ వాతావరణాన్ని కల్పించనుంది. ఓడియన్ మాల్ ప్రీమియం లోకల్ బ్రాండ్లు,ప్రపంచ ప్రఖ్యాత అంతర్జాతీయ బ్రాండ్ల సమ్మేళనంతో వినియోగదారులకు విశిష్టమైన షాపింగ్





అనుభవాన్ని అందిస్తోంది. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్,ఎలక్ట్రానిక్స్, నిత్యావసరాలతో ఈ మాల్ రూపుదిద్దుకుంది. ట్రెండ్ సెట్టింగ్ దుస్తులు, ఆకర్షణీయమైన యాక్సెసరీస్ ప్రత్యేకంగా ఎంపిక చేసిన లైఫ్‌స్టైల్ స్టోర్స్ వరకు షాపింగ్‌ను ఆసక్తిగా ఆస్వాదించే వారికి,నాణ్యతకు ప్రాధాన్యం ఇచ్చే వారికి ఓడియన్ మాల్ ఇష్టమైన గమ్యస్థానంగా మారనుంది. రిటైల్‌కే పరిమితం కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన అనేక ఆధునిక సౌకర్యాలతో సందర్శకుల అనుభవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది.వీటిలో విశాలమైన బహుళ అంతస్తుల పార్కింగ్ సదుపాయం,హై-స్పీడ్ ఎలివేటర్లు,ఆధునిక ఎస్కలేటర్లు,24ఇ7 సీసీటీవీ నిఘా, ఆధునిక భద్రతా వ్యవస్థలు,విశాలంగా ఉన్న కామన్ ఏరియాస్,వీల్‌చైర్ ఫ్రెండ్లీ యాక్సెస్, వాష్‌రూమ్స్, పవర్ బ్యాకప్ సదుపాయం ఉన్నాయి.ప్రత్యేక డైనింగ్ జోన్లో కేఫేలు, క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు, ఫైన్ డైనింగ్ అవుట్‌లెట్లతో విభిన్న రుచులు అందుబాటులో ఉన్నాయి.ఫ్యామిలీ, యూత్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు వినోదంతో పాటు గుర్తుండిపోయే విహార అనుభవాలను అందించనున్నాయి. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఎండీ అజహరుద్దీన్,ఎంపీ అనిల్ కుమార్ యాదవ్,రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ.ప్రకాష్ గౌడ్,ఎంఎల్‌సీ మహేందర్ రెడ్డి, ప్రమోటర్లు ఉ డెవలపర్లు ఓడియన్ మాల్ డైరెక్టర్ తుల్లా విజయేందర్ గౌడ్, ఓడియన్ మాల్ డైరెక్టర్ అమర్‌నాథ్ వుప్పలంచ,శాంత శ్రీ రామ్ కన్‌స్ట్రక్షన్స్ ఎండీ నర్సయ్య, పీవీఆర్ సినిమాస్ సీఈఓ ప్రమోద్ అరోరా,సైఫ్ అలీ ఖాన్,నజాఫ్ అలీ ఖాన్ పాల్గొన్నారు.
హైదరాబాద్‌లో సందర్శకులు అధికంగా వచ్చే వాణిజ్య కేంద్రాల్లో ఒకటైన ఆర్టీసీ ఎక్స్ రోడ్స్ వద్ద నిర్మితమైన ఓడియన్ మాల్ అద్భుతమైన కనెక్టివిటీ,స్పష్టమైన విజిబిలిటీని కలిగి ఉంది.సినిమా, సంస్కృతి,వాణిజ్య కార్యకలాపాలకు కేంద్రంగా నిలిచిన ఈ ప్రాంతానికి ఆధునిక, సమగ్ర మాల్ రాకతో మరింత ప్రాధాన్యం చేకూరనుంది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న నివాస ప్రాంతాలు,విద్యా సంస్థలు,కార్యాలయ ప్రాంతాలు,స్థిరమైన రిటైల్ మార్కెట్లను కలిపిన ప్రాథమిక, ద్వితీయ క్యాచ్‌మెంట్ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని రూపుదిద్దుకున్న ఈ మాల్ సందర్శకులతో పాటు రోజు వారీ షాపింగ్ అవసరాల కోసం వచ్చే వినియోగదారుల అవసరాలను కూడా తీరుస్తుంది.శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్స్, తుల్లా కుటుంబం, ఫర్జానా ఖాన్, అమర్‌నాథ్,తుల్లా ఓడియన్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేయబడింది. సుమారు 2.1లక్షల చదరపు అడుగుల మాల్ కార్పెట్ ఏరియా సుమారు 2.8 లక్షల చదరపు అడుగుల చార్జబుల్ ఏరియాతో ఈ మాల్ నిర్మాణం చేపట్టబడింది.మొత్తం ఏడు రిటైల్ అంతస్తులు,వీటికి తోడుగా మూడు ప్రత్యేక బేస్‌మెంట్ పార్కింగ్ అంతస్తులు ఈ అభివృద్ధిలో భాగంగా ఉన్నాయి. ఫ్యాషన్,లైఫ్‌స్టైల్, ఎలక్ట్రానిక్స్,వినోదం, ఆహారం,సేవలు వంటి విభాగాల్లో సమతుల్యతను అందించే విధంగా ప్రణాళిక చేయబడిన 40కి పైగా రిటైల్ అవుట్‌లెట్లు ఓడియన్ మాల్‌లో ఏర్పాటు కానున్నాయి. నగరంలో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌ను దృష్టిలో పెట్టుకుని సందర్శకుల సౌకర్యార్థం సుమారు 350 కార్ల పార్కింగ్ స్థలాలు,500 ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్లాట్లుతో విస్తృత పార్కింగ్ వసతులు ఉన్నాయి.ఓడియన్ మాల్ అంతర్గత డిజైన్ ఆధునికమైన, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయి.విశాలమైన ఎట్రియమ్స్, ఎస్కలేటర్లు,ఎలివేటర్ల ద్వారా సులభమైన ప్రయాణ సౌకర్యం, వెడల్పైన కారిడార్లు, వినియోగదారుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించిన కామన్ ఏరియాస్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తాయి. సహజమైన కాంతి ప్రీమియం ఫినిషింగ్‌తో రూపుదిద్దుకున్న ఈ డిజైన్ రిటైలర్లకు స్పష్టమైన విజిబిలిటీని కల్పించడమే కాకుండా సందర్శకులకు ఆహ్లాదకరమైన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుంది.ఓడియన్ మాల్‌లో రిటైల్ ప్రణాళికను అంతస్తుల వారీ విభాగాల సమన్వయంతో రూపొందించారు.ఇది సందర్శకుల ప్రవాహం సమతుల్యంగా ఉండేలా,షాపింగ్ ఆసక్తి పెరిగేలా చేస్తుంది.గ్రౌండ్ ఫ్లోర్‌ను ఫ్యాషన్,పురుషుల, స్పోర్ట్స్‌వేర్, ఆభరణాలు,వాచ్‌లు, కాస్మెటిక్స్ ఉ ఫ్రాగ్రెన్సెస్, కేఫేలు,లైఫ్‌స్టైల్ బ్రాండ్ల వంటి అధిక విజిబిలిటీ విభాగాలకు కేటాయించారు.ఫస్ట్ ఫ్లోర్‌లో ప్రధానంగా పురుషుల ఫ్యాషన్, దుస్తుల విభాగాలు ఉండగా,సెకండ్ ఫ్లోర్‌లో మహిళల దుస్తులు,పిల్లల ఫ్యాషన్,ఎలక్ట్రానిక్స్, ప్రత్యేక రిటైల్ అవుట్‌లెట్లు ఏర్పాటు చేశారు.మాల్‌లోని పై అంతస్తులను వినోదం, వెల్‌నెస్,డైనింగ్, విశ్రాంతికి కేటాయించడం ద్వారా ఉదయం నుంచి రాత్రివరకు మాల్ ఆహ్లాదకరంగా ఉంటుంది.ఓడియన్ మాల్లో వినోదం కీలకంగా నిలుస్తుంది. ఐనాక్స్ మల్టీప్లెక్స్తో పాటు ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సెంటర్,బౌలింగ్ అలీ, గేమింగ్ జోన్లు,మిస్టరీ రూమ్స్,లేజర్ షూటర్ అనుభవాలు,మినీ గోల్ఫ్ వంటి అనేక ఆకర్షణలు మాల్‌లో కలవు.ఇవన్నీ పిల్లలు, యువత,పెద్దలకు సమానంగా ఆసక్తిని కలిగించేలా రూపుదిద్దుకున్నాయి. ఈ విభిన్న వినోద సదుపాయాలతో ఓడియన్ మాల్ కేవలం షాపింగ్ గమ్యస్థానం మాత్రమే కాకుండా నగరానికి ఒక సంపూర్ణ లీజర్ హబ్గా నిలవనుంది. డైనింగ్ను విభిన్న రుచులు, సందర్భాలకు ప్రత్యేకంగా రూపకల్పన చేశారు.కేఫేలు,ఫైన్ డైనింగ్ రెస్టారెంట్లు, రెస్ట్-ఓ-బార్లు, విశాలమైన ఫుడ్ కోర్ట్‌తో కూడిన ఈ మాల్‌లో క్విక్-సర్వీస్ అవుట్‌లెట్ల నుంచి సిట్-డౌన్ డైనింగ్ వరకు విస్తృతమైన భోజన ఎంపికలు అందుబాటులో ఉంటాయి.సెలూన్లు, స్పాలు,బ్యూటీ డెస్టినేషన్లు వంటి వెల్‌నెస్,వ్యక్తిగత సంరక్షణ సేవలు మాల్‌కు లైఫ్‌స్టైల్ ఆకర్షణను మరింత పెంచుతాయి. ఓడియన్ మాల్ హైదరాబాద్ రిటైల్ రంగంలో ఒక ప్రతిష్ఠాత్మక ల్యాండ్‌మార్క్ గమ్యస్థానంగా అవతరించనుంది. మెట్రోపాలిటన్ నగరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ చారిత్రక వారసత్వాన్ని ఆధునిక డిజైన్,సాంకేతికతతో సమన్వయం చేస్తూ.. అందరికీ అందుబాటులో ఉండే నగర గమ్యస్థానంగా ఓడియన్ మాల్ నిలవనుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఆశించే స్థాయి నుండి శాసించే స్థాయికి ఓసీలు ఎదగాలి



**ప్రజావినికిడి ,(ఎల్బీనగర్):జనవరి 9,** చలో వరంగల్ ఓసీల సింహ గర్జన భారీ బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరణలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 11వ తేదీ ఆదివారం వరంగల్ లోజరిగే ఓసిల సింహగర్జన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలనే నేపథ్యంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య పిలుపుమేరకు ఓసి జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ టి పశుపతి నేతృత్వంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షులు పోచంపల్లి రమణారావు నేతృత్వంలో పోస్టర్ ను ఆవిష్కరించారు.శుక్రవారం నాడు నాగోల్ మోహన్ నగర్ లో ఓసీల సింహగర్జన బహిరంగ సభను జయప్రదం చెయ్యాలనే సందర్భంగా తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య అధ్యక్షులు పోచంపల్లి రమణారావు మాట్లాడుతూ,మనం ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని ఇప్పుడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని అన్నారు. ప్రభుత్వాలను అడిగేందుకు ఓసీల సింహగర్జన సభ నిర్వహించడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఓసి జెఎసి అధ్యక్షులు తాడిశెట్టి పశుపతి మాట్లాడుతూ,మన ఓటు బ్యాంకు శాతం తక్కువేమీ కాదని పార్టీలకు అతీతంగా మనం పోరాటం చేస్తే ప్రభుత్వం మన పోరాటానికి దిగి వస్తుందని అన్నారు.వరంగల్ లోజరిగే సభను విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవులపల్లి రంగారావు, బ్రాహ్మణ సంఘ సమాఖ్య కోశాధికారి ఊరే ప్రసాదరావు దేవులపల్లి అశోక్ కుమార్,తడకమళ్ళ రంగ సాయి, జయరాం గూడా, గూడా రాజేష్, అక్కినేపల్లి వెంకటేశ్వరరావు ఓసి జెఎసి సభ్యులు, ప్రసాద్ బొమ్మ గంటి ప్రసాద్,మాచర్ల వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్టియు టిఎస్ 2026 క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజావినికిడి,(వాజేడు):జనవరి10,** మండల కేంద్రంలో జెడ్పి హెచ్ఎస్ వాజేడు నాగారం పాఠశాలలో శుక్రవారం పిఆర్టియు టిఎస్ 2026 క్యాలెండర్ ను మండల అధ్యక్షులు పోరిక స్వరూప్ సింగ్,ప్రధాన కార్యదర్శి ఆకదామోదర్, ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు,గ్రామ సర్పంచ్ బోదబోయిన స్వరూప,పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం చేతుల మీదుగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు రావలసిన డిఏలను, పెండింగ్ లో ఉన్నటువంటి బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మండల బాధ్యులు నునావత్ రాజేష్, బాలాజీ,సీనియర్ నాయకులు కంచు ప్రభాకర్,శ్రీకాంత్, రాజేష్,రాజ్యలక్ష్మి, రాజేష్ షిండే, ఆనంద్,కుమార్ బాబు,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# చెరుకూరులో వాలీబాల్ టోర్నమెంట్




**ప్రజావినికిడి,(వాజేడు):జనవరి 10,** చెరుకూరు గ్రామంలో రాహుల్ కిషన్ జాదవ్ ఐఎఫ్ఎస్,జిల్లా అటవీశాఖ అధికారి ములుగు ఆదేశానుసారం అటవీశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్ ముగియడంతో అడవిలో సంభవించు అగ్నిప్రమాదల నివారణ గురించి, వన్యప్రాణుల సంరక్షణ గురించి అవగహన సదస్సు నిర్వహించడం జరిగింది,వాలీబాల్ టోర్నమెంట్లో 8 టీమ్స్ పాల్గొనగా అందులో రాంపురం టీమ్ మొదటిస్థానం, చెరుకూరు టీమ్ రెండవ స్థానం కైవసం చేసుకున్నాయి ఈ కార్యక్రమంలో చెరుకూరు గ్రామ సర్పంచ్ వాసం రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెరుకూరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎల్. నారాయణ,బీట్ ఆఫీసర్స్ ఎమ్.పద్మ, కె. మనీషా,బేస్ క్యాంపు సిబ్బంది జనార్దన్,దామోదర్ పాల్గొన్నారు.

# షాద్ నగర్ డిసిపిగా బాధ్యతలు చేపట్టిన సిహెచ్ శిరీష

## నందిగామ పోలీస్ స్టేషన్ లో తాత్కాలిక కార్యాలయం







**ప్రజావినికిడి,(షాద్ నగర్):**డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) అధికారిగా నూతనంగా సిహెచ్ శిరీష శుక్రవారం లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు. షాద్ నగర్ నియోజకవర్గంలోని నందిగామ మండలంలో స్థానిక పోలీస్ స్టేషన్ పై అంతస్తులు డిసిపి కార్యాలయం ఏర్పాటు చేశారు.షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో షాద్ నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, కొత్తూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ నర్సయ్య, కేశంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరహరి,షాద్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్,నందిగామ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్,షాద్ నగర్ రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఎస్సైలు సుశీల,శ్రీకాంత్,రవీందర్ నాయక్,విజయ్ కుమార్ తదితరులు డీసీపీకి స్వాగతం పలికారు ఈ సందర్భంగా ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం : మంత్రి పొంగులేటి

## మున్సిపాలిటీల అభివృద్ధికి సర్కార్ కట్టుబడి ఉంది -రూ. 3.17 కోట్ల పనుల శంకుస్థాపనలో మంత్రి వ్యాఖ్యలు





**ప్రజావినికిడి,(ఇల్లెందు):** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు.శుక్రవారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో రూ.3.17 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇల్లెందు మున్సిపాలిటీకి మహర్దశ పడుతుందని, పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ప్రధానంగా పట్టణంలోని 1,4,7,8, 9,18,22,24 వార్డులలో నెలకొన్న సీసీ రోడ్లు,డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇల్లెందును అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని పొంగులేటి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్,ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య,మాజీ మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి,మండల రాము,బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్,జిల్లా అధికారులు,స్థానిక అధికారులు,మాజీ ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మలు అందరూ ఐక్యతతో ఉండి ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలి

## రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా సంఘం అధ్యక్షురాలు డా.చిలుకూరి లక్ష్మరామాచారి

## ఎల్బీనగర్, మన్సూరాబాద్ స్వర్ణకార ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ





**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):జనవరి 9,**విశ్వకర్మలు అందరూ ఐక్యతతో ఉండి,ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా సంఘం అధ్యక్షురాలు డా. చిలుకూరి లక్ష్మరామాచారి అన్నారు.అప్పుడే మనకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎల్బీనగర్ మన్సూరాబాద్ స్వర్ణకార ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆంగ్ల నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ కార్యక్రమము ఎల్బీనగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహిళా సంఘం అధ్యక్షురాలు డా. చిలుకూరి లక్ష్మరామాచారి , దిల్సుఖ్నగర్.స్వర్ణకార సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ కీర్తి అనంతాచారి, ప్రధానకార్యదర్శి బ్రహ్మశ్రీ శ్రీరామదాసు గోవర్ధనాచారి , కోశాధికారి బ్రహ్మశ్రీ తట్కునూరి రవిచారి, ఉపాధ్యక్షులు బ్రహ్మశ్రీ చెన్నోజు శ్రీనివాసాచారి బ్రహ్మశ్రీ నారాయణ దాసు ప్రవీణ్ చారి, ఐక్య వేదిక నుండి రంగారెడ్డి జిల్లా స్వర్ణకార సంఘానికి వెళ్లిన బ్రహ్మశ్రీ ఐటికాల వెంకటరమణచారి వేదిక నుండి దిల్సుఖ్నగర్ సంఘానికి వెళ్లిన గౌరవ సలహాదారులు బ్రహ్మశ్రీ అద్దోజు కృపాకరాచారి, ఉపాధ్యక్షులు బ్రహ్మశ్రీ రాచకొండ శ్రీనివాసచారిఆర్గనైజింగ్ సెక్రటరి బ్రహ్మశ్రీ తీగలపల్లి అశోక్ చారి, కల్చరల్ మెంబర్ బ్రహ్మశ్రీ నాంపల్లి లక్ష్మణాచారి,ఇంచార్జులు బ్రహ్మశ్రీ దాసోజు శ్రీనివాసాచారి ,బ్రహ్మశ్రీ బానగర్ అనిల్ చారి , గొల్తి సుబ్బారావు , ముఖ్య అతిథుల సమక్షంలో ఐక్య వేదిక కన్వీనర్స్ బ్రహ్మశ్రీ మారోజు రమేష్ చారిగారు,బ్రహ్మశ్రీ చిలుకూరి రామాచారి , బ్రహ్మశ్రీ బాణాగర్ వేణుగోపాల్ చారి , బ్రహ్మశ్రీ రాచకొండ సురేష్ కుమార్ చారి,గౌరవసలహాదారులు, గౌరవ ఇంచార్జులు పాల్గొన్నారు,అందరి సమక్షంలో బ్రహ్మశ్రీ చిలుకూరి రామాచారి అధ్యక్షత న ముందుగా శ్రీ ప్రసన్నంజనేయ స్వామి వారి సన్నిధిలో అర్చన పూజ అనంతరం బ్రహ్మశ్రీ కాసోజు శ్రీధరాచార్యులు పురోహితులు వారి సమక్షంలో మన కుల దైవం అయిన శ్రీ మద్విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్ర స్వాముల వారి అర్చనా పూజ అనంతరం క్యాలండర్ ఆవిష్కరణ జరిగింది ఈ కార్యక్రమానికి వచ్చి మా అతిథ్యాన్ని స్వీకరించి చిరు సత్కారాన్ని గ్రహించి మమ్ము ఆనందిపజేసిన ప్రతి ఒక్క సభ్యునికి చిలుకూరి రామాచారి ధన్యవాదాలు తెలియజేశారు.


# కొమ్ము కృష్ణుడు.. అయ్యాడు అధ్యక్షుడు..

## రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా కొమ్ము కృష్ణ..

**అధ్యక్ష స్థానంలో నందిగామ ప్రథమ పౌరుడు..**
**సేవలు,నాయకత్వ లక్షణాలతో ఇంతింతై ఎదిగిన నేత..**
**కొమ్ము కృష్ణ ఎంపికపై ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేతల హర్షం..**
**పెప్పరస్ పోర్టులో రాష్ట్ర సర్పంచుల సంఘం సమావేశం..**
**రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు సౌధాని భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికలు..**




**ప్రజావినికిడి,(నందిగామ):**
సేవకుడిగా అందరి మన్ననలను అందుకుంటూ.. నాయకుడిగా ఒక్కో మెట్టు పైకి ఎదుగుతూ తనదైన ముద్ర వేసిన నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ ఏకంగా జిల్లా సర్పంచుల సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. గతంలో ఎంపిటిసి సంఘ జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేసిన ఆయన ప్రస్తుతం ప్రథమ పౌరులకే జిల్లా స్థాయిలో ప్రథమ పౌరుడిగా,సంఘానికి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సర్వత్ర ప్రశంసలు అందుకుంటుంది. కొత్తూరు పురపాలిక పరిధిలోని పెప్పరస్ పోర్టులో రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు సౌధాని భూమన్న యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలలో నాయకత్వ లక్షణాలు పుష్కలంగా ఉన్న కొమ్ము కృష్ణ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా కల్వకుర్తికి చెందిన సంధ్యారాణి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రవీందర్ రెడ్డి,7ఉపాధ్యక్షులుగా ప్రవీణ్ (మహేశ్వరం) పొగాకు రాంగోపాల్ (రాజేంద్రనగర్) కార్యదర్శిగా ఎర్ర వెంకటేశ్ యాదవ్ (ఇబ్రహీంపట్నం), మహిళా విభాగం అధ్యక్షురాలుగా మాధవి (చేవెళ్ల) ఎన్నికయ్యారు.



### ఆదర్శంగా పనిచేస్తా..
### జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ

తనకు అప్పగించిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చి ఆదర్శవంతంగా పనిచేస్తానని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్ము కృష్ణ అన్నారు.ఎన్నికైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తన మీద నమ్మకాన్ని పెట్టుకొని తనను ఎంపిక చేసిన రాష్ట్ర కమిటీకి,సహ సర్పంచ్లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అంతకుముందు రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న యాదవ్ మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా సర్పంచులు పనిచేసే నిధుల కోసం ప్రభుత్వాలతో పోరాడి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని దాదాపు అన్ని గ్రామాల సర్పంచులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సమావేశానికి నియోజకవర్గంలోని పలువురు సర్పంచులు జిల్లాకు చెందిన సర్పంచులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.


తెలంగాణ రాష్ట్ర పంచాయితీ సర్పంచ్‌ల సంఘం
(రిజిస్టర్డ్ నెం.563/04)
హైదరాబాద్.

ఎన్నిక పత్రము

శ్రీ కొమ్ము కృష్ణ ముదిరాజ్ - సర్పంచ్ - నందిగామ గ్రామపంచాయితి గారు తెలంగాణారాష్ట్ర పంచాయితి సర్పంచ్‌ల సంఘంనకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గా ఎన్నిక కాబడినారు. మీ భాధ్యతలను సర్పంచ్‌ల సంక్షేమమునకు, సంఘబలోపేతమునకు క్రమశిక్షణ తో పని చేయగలరని, రాష్ట్ర సంఘనియమ నిభంధనలుకు లోబడి పని చేయాలని నిర్దేశిస్తూ, అభినందిస్తూ, ఎన్నిక పత్రమును అందజేయడమయినది.

హైదరాబాద్ 9/1/2026
30-12-2025
ఆఫీస్ ప్లాట్ నెం.104, తాజ్ ఎన్‌క్లేవ్, వాసవి హాస్పిటల్ ఎదురు, లక్డీకాపూల్, హైదరాబాద్-500004, తెలంగాణా
సెల్ : 9440443848, 9000380124

సౌధాని భూమన్న యాదవ్
వ్యవస్థాపక అధ్యక్షులు
తెలంగాణ రాష్ట్ర పంచాయితి సర్పంచ్‌ల సంఘం

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# రోడ్డు భద్రత థీమ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** శుక్రవారం రోజు రోడ్డు భద్రత "థీమ్" ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం నందు ఈ ముగ్గుల పోటీలను నిర్వహించనైనది. విజేతలకు గౌ. శ్రీ. రమేష్(జే టి సి (హైదరాబాద్),గౌ. శ్రీమతి. సూర్యా ధనుంజయ (వైస్ ఛాన్సలర్) ఆయన చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంవిఐ శీతల్ చౌహన్, ఏఎంవిఐ లు కార్తీక్,అభిలాష్, ప్రసాద్ మురారి అదేవిధంగా విసిఐడబ్ల్యూ ఫ్యాకల్టీ, ఆర్టిఏ సిబ్బంది పాల్గొన్నారు.











# స్లీపర్ బస్సు ప్రమాదాల నివారణకు చర్యలు

## గుర్తింపు పొందిన సంస్థలకే తయారీ పనులు -గతేడాది ప్రమాదాలతో కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ,**జనవరి9ప్రజావినికిడి**

స్లీపర్ బస్సు ప్రమాదాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్థానికంగా పనిచేసే మాన్యువల్ స్లీపర్ బస్సు బాడీ బిల్డర్లకు కాకుండా.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆటోమొబైల్ కంపెనీలు, తయారీ సంస్థలకే బస్సుల తయారీకి అనుమతి ఉంటుందని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ప్రకటన జారీ చేసింది. గత ఏడాది దేశంలోని పలు రాష్ట్రాల్లో ఘోర బస్సు ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రైవేటు స్లీపర్ బస్సులు ప్రమాదానికి గురవడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ చర్యలకు ఉపక్రమించారు. ఏపీ, రాజస్థాన్ సహా పలు రాష్ట్రాల్లో జరిగిన బస్సు ప్రమాదాల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఈ బస్సు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నాయని నివేదికల్లో తేలిందన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు బయటపడిందన్నారు. అంతే కాకుండా అగ్నిప్రమాదం జరిగిన సమయాల్లో మంటలను నియంత్రించేందుకు అవసరమైన పరికరాలు బస్సుల్లో లేకపోవడం కూడా



ప్రమాదానికి కారణమైందని చెప్పారు. అలాగే బస్సుల్లో తరచూ తనిఖీలు చేపట్టకపోవడం కూడా మరో కారణమని నివేదికల్లో తేలిందని చెప్పారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.

బస్సు ప్రమాదాల నివారణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన సంస్థలు మాత్రమే బస్సులను తయారు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పుడు ఉన్న అన్ని స్లీపర్ బస్సుల్లో అగ్నిప్రమాద గుర్తింపు వ్యవస్థ, ప్రతి ఎమ్జెగ్÷న్సీ ఎగ్జిట్ వద్ద సుత్తి, అత్యవసర లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించే బస్సులు, అలాగే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. దేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు చర్యలు చేపట్టినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కార్లలో ఉచిత స్పెక్ట్రమ్‌ను ఉపయోగించి వాహనం నుంచి వాహనానికి కమ్యూనికేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ÷ఎ2÷ఎ టెక్నాలజీ ద్వారా వాహనాలు తమ వేగం, స్థానం, దిశ వంటి కీలక సమాచారాన్ని సమీప వాహనాలతో పంచుకోగలవని ఆయన వివరించారు. టెక్నాలజీ వల్ల అకస్మాత్తుగా బ్రేక్ వేసినా.. రోడ్డుపై వాహనాలు ఆగి ఉన్నా.. మిగతా వాహనాలకు అలర్ట్ వెళుతుందని కేంద్ర మంత్రి తెలిపారు. తద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ఈ వైర్‌లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థను అన్ని వాహనాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ సాంకేతికత రోడ్డు భద్రతను మరింత మెరుగుపరుస్తుందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మొదలైన సంక్రాంతి ప్రయాణాలు

## ఊరిబాట పట్టిన పట్టణ ప్రజలు -బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద రద్దీ విజయవాడ రహదారిలో బారులు తీరిన వాహనాలు


హైదరాబాద్,**జనవరి9ప్రజావినికిడి** విద్యా సంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం నుంచే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ మొదలైంది. సంక్రాంతి పండగకు 3 రోజుల ముందే పయనమవుతుండటంతో జాతీయ రహదారిపై వాహనాల సందడి నెలకొంది. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా జాతీయ రహదారిపై పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టారు. హైవేపై వెళ్లే వాహనాలకు అంతరాయం కలగకుండా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నారాయణపురం రోడ్డును పోలీసులు మూసివేశారు. పంతంగి టోల్‌ప్లాజా వద్ద మొత్తం 16 టోల్ బూత్‌లు ఉండగా వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకొని పదింటిని విజయవాడ మార్గంలోనే తెరిచారు. ఫాస్టాగ్ విధానం అమలులో ఉండటంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. అదనపు టోల్ సిబ్బందిని నియమించారు. శని, ఆదివారాల్లో రద్దీ అధికంగా ఉండనుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిపోతున్నాయి. శనివారం నుంచి విద్యాసంస్థలకు సెలవులు, ఆఫీసులకు వీకెండ్ కావడంతో స్వగ్రామాలకు వెళ్లేందుకు హైదరాబాద్ నగర వాసులు




పోటెత్తారు. పట్టణాల నుంచి సొంతూళ్లకు బయలుదేరిన ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు కళకళలాడుతున్నాయి. మరోవైపు సొంత వాహనాల్లోనూ ప్రజలు స్వగ్రామాలకు బయలుదేరుతున్నారు. దీంతో ప్రధాన రహదారులన్నీ వాహనాలమయంగా మారిపోయాయి. ÷ఎఖ్యంగా హైదరాబాద్ నుంచి తెలంగాణలోని వివిధ పల్లెలు, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు వెళ్లే వారితో రోడ్లన్నీ నిండిపోయాయి. హైదరాబాద్- విజయవాడ 65వ జాతీయ రహదారి అయితే మరింత రద్దీగా మారింది. పంతంగి టోల్ గేట్ వద్ద వాహనాల బారులు తీరాయి. దీంతో స్వగ్రామాలకు వెళ్లే వారికి ట్రాఫిక్ సమస్యగా మారిపోయింది. రద్దీ సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రయాణాలు చేయాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.



# ఓటరు నమోదు ప్రక్రియను సద్వినియగం చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపిన హరి భూషణ్ పటేల్



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు భూషణ్ పటేల్ ఆధ్వర్యంలో గత పది రోజుల నుంచి స్థానిక సీఎస్కే వెంచర్లో ఓటర్ నమోదు ప్రక్రియ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. గత పది రోజుల నుంచి ఈ కార్యక్రమానికి పూనుకోవడం జరిగిందని,స్థానిక ప్రజలతో పాటు పదో వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఏదో ఒక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టే భూషణ్ పటేల్ ఓటర్ల నమోదు ప్రక్రియ కూడా నాలుగు కంప్యూటర్లు పెట్టి సిబ్బందిని నియమించి తన సొంత ఖర్చులతో ఉచితంగా ఇలాంటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం నిజంగా అభినందనీయమని కన్జ్యూమర్ కమిషన్ మీడియేటర్ దిడ్డి గోపాల్ నారాయణ్ అభినందించారు. ఓటర్ల అమూల్యమైన సమయాన్ని వృధా చేసుకోకూడదనే సదుద్దేశంతోనే తాను ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని భూషణ్ పటేల్ తెలిపారు. రాజకీయంలో ఎలాంటి స్వలాభపేక్ష ఆశించకుండా సేవా కార్యక్రమాలు చేస్తున్న భూషణ్ పటేల్ లాంటి నాయకులను ఆదరించాల్సిన అవసరం ఉందని గోపాల్ నారాయణ అభిప్రాయపడ్డారు.

# కేటీఆర్ దిష్టిబొమ్మ కు ఉరి వేసి నిరసన తెలిపిన యువజన కాంగ్రెస్ నాయకులు





**ప్రజావినికిడి, (శంషాబాద్):జనవరి 9,** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావుదిష్టిబొమ్మకు యువజన కాంగ్రెస్ ఉరి వేసి నిరసన తెలిపారు. అనంతరం కేటీఆర్ దిష్టిబొమ్మను ఊరేగింపు చేసి శవయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ మాట్లాడుతూ,కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యాలపై నీరసిస్తూ శుక్రవారం రంగారెడ్డి జిల్లా,శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో బ్రిడ్జికి దిష్టిబొమ్మను ఉరి తీసి నిరసన చేసినట్టు తెలిపారు. మరోసారి రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి పై విమర్శలు చేస్తే బిఆర్ఎస్ భవన్ ను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కేటీఆర్ రాహుల్ గాంధీ,రేవంత్ రెడ్డి లకు బహిరంగ క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపన చెప్పకపోతె మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శివచరణ్,సంతోష్ గౌడ్,సై నికేష్,మహేశ్ గౌడ్,చందు,సంజయ్, స్వప్న,దయాగౌడ్, దళపతి,ప్రేమ్, అజయ్,అమర్, ప్రశాంత్,కిరణ్ గౌడ్, గోపాలకృష్ణ,విజయ్ లతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.ద

# క్రీడల ద్వారా శారీరక దృఢత్వం..మానసిక ఉల్లాసం..

## కొత్తపేట 2 వ వార్డు మెంబర్ అల్లే ప్రవళిక సంతోష్ కుమార్..

## సొంత ఖర్చులతో క్రీడాకారులకు బ్యాట్ ల పంపిణీ.,




**ప్రజావినికిడి ,(కేశంపేట):** క్రీడలతో శారీరక దృఢత్వం,మానసిక ఉల్లసం కలుగుంతుంగని కొత్తపేట 2వ,వార్డు మెంబర్ అల్లే ప్రవళిక సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం కేశంపేట మండలంలోని కొత్తపేట గ్రామంలో కేపీఎల్ -7 అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ అల్లే ప్రవళిక సంతోష్ గరుడ టీం కు తన సొంత ఖర్చులతో క్రీడాకారులకు బ్యాట్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవళిక సంతోష్ కుమార్ మాట్లాడుతూ, ఎల్లప్పుడు క్రీడాకారులకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత ఆటలపై మక్కువ పెంచుకోవాలని,చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. మత్తుకు బానిస కావద్దని పేర్కొన్నారు. క్రీడాకారులకు తన సహాయ సహకారాలు అందించడంలో ముందుంటానని తెలియజేశారు.

# డిజిపి శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట

## నియాకంపై సవాల్ పిటిషన్ కొట్టివేత

హైదరాబాద్,**జనవరి9ప్రజావినికిడి**




తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. డీజీపీ నియామక ఉత్తర్వులను సస్పెండ్ చేయాలన్న పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా శివధర్‌రెడ్డిని డీజీపీగా నియమించారంటూ హైదరాబాద్‌కు చెందిన సామాజిక కార్యకర్త టి. మధన్‌గోపాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు విచారణ జరిగింది. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయస్థానం డీజీపీ నియామక ఉత్తర్వులపై స్టే విధించడానికి నిరాకరించింది. రెగ్యులర్ ప్రాసెస్‌ను 4 వారాల్లో పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పూర్తిస్థాయి డీజీపీ నియామకం కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఐఖాఅ) ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. యూపీఎస్సీకి పంపిన తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి సూచిస్తూ.. తదుపరి విచారణను హైకోర్టు ఫిబ్రవరి 5కు వాయిదా వేసింది.

# ప్రాజెక్టుల్లో మునిగిపోతున్న నిర్వాసిత జీవితాలు







**జనవరి 9 ప్రజావినికిడి**
పోలవరం కావచ్చు...మల్లన్న సాగర్ కావచ్చు లేదా కొండపోచమ్మ సాగర్ కావచ్చు లేదా..గతంలో గంగవరం పోర్టు కావచ్చు..ప్రాజెక్టులు ఏవైనా త్యాగం ప్రజలది, భోగం కార్పోరేట్లది అవుతోంది. వేలకోట్లు పెట్టి ప్రభుత్వాలు కట్టించే ప్రాజెక్టులు సైతం కార్పోరేట్లకు ధారదత్తం చేస్తున్నారు. భూముల సేరణ, ఇళ్లను సేకరించడం తరవాత వారికి కబుర్లు చెప్పడం ఆ తరవాత వారి త్యాగాలను మరచిపోతున్నారు. గంగవరం పోర్టు కోసం త్యాగం చేసిన మత్స్యకారులు రోడ్డున పడ్డారు. పోర్టును పొందిన ఆదానీ ఒడ్డున పడ్డారు. ఇలా ఏ ప్రాజెక్టు తీసుకున్నా ఇదే చరిత్ర కనిపిస్తుంది. ఘనత వహించిన తెలంగాణ వల్లభుడు కెసిఆర్ హయాంలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు భూములు ఇచ్చి, ఊర్లను త్యాగం చేసిన వారు ఆగమయ్యారు. కెసిఆర్, ఆయన అనుయాయలు పొలాలు మాత్రం పచ్చగా తడుస్తున్నాయి. తాజాగా అమరావతి రాజధాని కోసం లక్ష ఎకరాలు సేకరిస్తున్నారు. అయినా పాలకలు భూదాహం తీరడం లేదు. అమరావతిలో భూమి తీసుకున్న రైతులకు అరకొరగానే పరిహారం అందించారు. ప్లాట్లను సక్రమంగా అందించలేదు. బహిరంగంగా వారిపై ప్రశంసలు కురిపించడం తప్పవారికి లబ్ది చేకూర్చడం లేదు. ఇంకా ప్లాట్ల కోసం అక్కడి రైతులు పాట్లు పడుతూనే ఉన్నారు. తాజాగా రెండోదఫా భూసేకరణ మొదలయ్యింది. ఈ అభివృద్ధి ఏ ప్రజల కోసమన్నది పాలకులు ఆలోచన చేయాలి. ప్రజలను ముంచి చేసే పనులు మంచి ఎలా అవుతాయి. పోలవరం సంగతి చూస్తే అక్కడి నిర్వాసితులు దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇలా దేశవ్యాప్తంగానే కాదు... తెలుగు రాష్ట్రాల్లో ఘనత వహించిన పాలకులు రైతులను నట్టేట ముంచుతున్నారు. పోలవరంలో సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం.ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017 తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజిలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినా అది అమలుకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తున్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రం పరిశీలించిన ఆయన ముంపు ప్రాంతాలను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన. వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి

నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వాసితులకు న్యాయం చేయడానికి కృషి చేయడం లేదు. తీయని మాటలు తప్ప చిత్తశుద్ధ ఇకానరావడం లేదు. జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టం దాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆ తరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్పించింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర. అందుకనే దశలవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ ఆండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు. మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది.డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేక పోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిపైచేసిన ఉన్నతాధి కారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు. ఇప్పటికైనా ముందు నిర్వాసితులను ఆదుకోవాలి. దుబారా హెలికప్టర్ ఖర్చులు తగ్గించుకుని వారికి న్యాయం చేయాలి.

## కోల్‌కతాలో ఇడి దాడులకు నిరసన

### హోంమంత్రి అమిత్ షా నివాసం ముందు టిఎంసి ఆందోళన

న్యూఢిల్లీ,**జనవరి 9 ప్రజావినికిడి**
కోల్‌కతాలో ఈడీ దాడులను ఖండిస్తూ టీఎంసీ ఎంపీలు ఢిల్లీలోని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కార్యాలయం ముందు నిరసనలు చేపట్టారు. శుక్రవారం ఉదయం టీఎంసీ ఎంపీలు డెరెక్ ఓ్బ్రెయిన్, శతాబ్ది రాయ్, మహువా మొయిత్రా, కీర్తి ఆజాద్‌తో పాటు మరికొంతమంది నిరసనలు చేపట్టారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేయటం మొదలెట్టారు. పోలీసులు రంగంలోకి దిగి వారిని అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, ఎంపీలకు మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అతి కష్టం మీద




వారిని అక్కడి నుంచి పార్లమెంట్ స్ట్రీట్ పీఎస్‌కు తరలించారు. రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ ఐప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంలో గురువారం ఈడీ సోదాలు నిర్వహించింది. కోల్‌కతాలోని ఆయన నివాసంలో ఈడీ సోదాలు జరుగుతున్న సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అక్కడకు చేరుకున్నారు. ఈడీ తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా మమతా మీడియాతో మాట్లాడుతూ.. 'మా ఐటీ సెల్ చీఫ్ ఇంట్లో సోదాలు నిర్వహించారు. మా పార్టీకి సంబంధించిన దస్త్రాలు, హార్డ్ డిస్కలను స్వాధీనం చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మా పార్టీ అభ్యర్థుల వివరాలు వాటిలో ఉన్నాయి. వాటిని వెనక్కు తీసుకున్నారని అన్నారు. మా పార్టీకి సంబంధించిన డాక్యుమెంట్లను ఈడీ తీసుకోవచ్చా? నేను ఇలాగే బీజేపీ ఆఫీసుకు వెళితే పరిస్థితి ఏమిటి? ఓటర్ జాబితా సమగ్ర సవరణ పేరిట ఇప్పటికే 5 లక్షల మంది పేర్లను తొలగించారు. కేవలం ఎన్నికలు జరగనున్నాయనే ఇలా చేస్తున్నారు'.. అంటూ మండిపడ్డారు. కాగా, కేంద్రం రాజకీయ లబ్ది కోసం ఈడీని అస్త్రంగా వాడుతోందని టీఎంసీ పార్టీ నేతలు అంటున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు.

## టిక్కెట్ ధరల పెంపు మెమోలు ఎలా ఇస్తారు

### ధరలు పెంచబోమని మంత్రే స్వయంగా చెప్పారుగా

### ప్రభుత్వ తీరుపై మండిపడ్డ తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్,**జనవరి 9 ప్రజావినికిడి**
కొత్త సినిమాల టికెట్ ధరలను పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తూ మెమోలు జారీ చేయడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలివిగా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచబోమని సంబంధిత మంత్రే స్వయంగా ప్రకటించారని, అయినా కూడా ధరల




పెంపునకు మెమోలు ఎందుకు ఇస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసింది. ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు మీ ఆలోచన మారడం లేదంటూ మండిపడింది. మెమో ఇచ్చే అధికారికి నిబంధనలు తెలియవా? అంటూ తీవ్ర స్వరంతో ప్రశ్నించింది. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది రాజాసాబ్' సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు అధికారులు అనుమతించిన సంగతి తెలిసిందే. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.105, మల్టీప్లెక్స్‌ల్లో రూ.132 పెంపునకు అనుమతి ఇచ్చింది. 12 నుంచి 18వ తేదీ వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.62, మల్టీప్లెక్స్‌ల్లో రూ.89 పెంపునకు అనుమతి ఇచ్చింది. టికెట్ లాభాల్లో 20 శాతం ఫిలిం ఫెడరేషన్‌కు ఇవ్వాలని ఆదేశాలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 'రాజాసాబ్' టికెట్ ధరల పెంపును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా టికెట్ల ధరల పెంపునకు అనుమతిస్తున్నారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. హోంశాఖ కార్యదర్శికి మెమో జారీ చేసే అధికారం లేదని ఆయన కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, హైదరాబాద్‌లో సీపీ మాత్రమే టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని కోర్టుకు వివరించారు.

## ప్రశాంతంగా ముగిసిన ఉత్తర ద్వార దర్శనం

### దర్శనాలపై దాదాపు 93 శాతం భక్తులు సంతృప్తి - -స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు

### శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లు రాక -మీడియా సమావేశంలో టిటిడి ఛైర్మన్, ఇవోలు వెల్లడి

తిరుమల,**జనవరి 9 ప్రజావినికిడి** :వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30 నుండి జనవరి 8వ తేది వరకు నిర్వహించిన వైకుంఠ ద్వార దర్శనాలకు టీటీడీ చేసిన ఏర్పాట్లపై భక్తులు విశేష సంతృప్తి వ్యక్తం చేసినట్లు టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు తెలియజేశారు. వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతం కావడంతో ఆయన టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరిలతో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవన్ లో శుక్రవారం ఉదయం మీడియా సమావేశం నిర్వహించారు.



స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులందరూ కూడా టీటీడీ కల్పించిన సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఏఐ సహకారంతో ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా టోకెన్ లేని భక్తులకు కూడా వేగవంతంగా దర్శనం చేయించామని అన్నారు. వైకుంఠ ద్వార దర్శనాలపై దాదాపు 93 శాతం మంది భక్తులు సంతృప్తి చెందారని అన్నారు. ఈ పది రోజుల్లో స్వామివారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య 7.83 లక్షలు అన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాల్లో 6.83 లక్షల మంది దర్శించుకోగా ఈ ఏడాది లక్ష మంది భక్తులకు అదనంగా దర్శనాలు జరిగాయన్నారు. జనవరి 2వ తేది శుక్రవారం రోజు అయినప్పటికీ రికార్డు స్థాయిలో 83 వేల మంది భక్తులకు దర్శనం కల్పించామని అన్నారు. జనవరి 3వ తేది శనివారం అత్యధికంగా దాదాపు 89 వేల మందికి దర్శనం జరిగిందన్నారు. అందుబాటులో ఉన్న 182 గంటల దర్శన సమయంలో 164 గంటల సమయం సామాన్య భక్తులకు కేటాయించడంతో సామాన్య భక్తుల్లో ఆనందం కలిగిందన్నారు. పది రోజుల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.41.14 కోట్లుగా తెలిపారు. భక్తులకు విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య 44 లక్షలు అన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 10 లక్షల లడ్డూలు అదనంగా విక్రయం జరిగిందన్నారు. దాదాపు 2400 మంది పోలీసులు, 1150 మంది విజిలెన్స్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని అన్నారు. వివిధ విభాగాల సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు భక్తుల రద్దీని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్లు వారు వెల్లడించారు. తిరుమల, తిరుపతిలో 5 భాషల్లో భక్తులకు అర్థమయ్యేలా 400 ప్రచార బోర్డులు ఏర్పాటు. రేడియో బ్రాడ్ కాస్టింగ్ ద్వారా 5 భాషల్లో వైకుంఠ ద్వార దర్శనాలపై అవగాహన కల్పించామని అన్నారు. తిరుమలలో విద్యుత్ దీపాలంకరణపై భక్తులు విశేష ప్రశంస వచ్చిందన్నారు. తిరుమలలో టీటీడీ విజిలెన్స్, పోలీసులు సమన్వయంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా బ్యారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తిరుమలలో నీటి కొరత లేకుండా నిరంతరాయం భక్తులకు నీటి సరఫరా చేశామని అన్నారు. ఈ పది రోజుల్లో 33 లక్షల మంది భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ జరిగిందన్నారు. గత వైకుంఠ ద్వార దర్శనాలతో పోల్చితే ఈసారి 9.29 లక్షల మంది భక్తులకు అదనంగా అన్న ప్రసాదాలు పంపిణీ చేశామని అన్నారు. తొలి మూడు రోజులు టోకెన్ కలిగిన భక్తులకే దర్శనం కల్పించడం జరిగిందన్నారు. దర్శన క్యూ లైన్లు, రోడ్లు, మరుగుదొడ్ల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా పారిశుద్ధ్య సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తూ పరిశుభ్రతకు పెద్దపీట వేశామన్నారు. ఈ సందర్భంగా టీటీడీ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని చక్కటి సేవలు అందించిన పోలీస్ యంత్రాంగం, జిల్లా యంత్రాంగం, ఏపీఎస్ ఆర్టీసీ, శ్రీవారి సేవకులు, ఇతర విభాగాలు, మీడియా ప్రతినిధులకు ఛైర్మన్ ధన్యవాదాలు తెలియజేశారు.టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ మాట్లాడుతూ తిరుమలలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా గతంలో కంటే అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. గత వైకుంఠ ఏకాదశి రోజు 7 లక్షలకు పైగా దర్శించుకుంటే ఈసారి 12 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నారని తెలిపారు. టీటీడీ భక్తుల కోసం చేస్తున్న సౌకర్యాలను చూసి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నారని చెప్పారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి మాట్లాడుతూ వివిధ విభాగాల మధ్య సమన్వయంతో సమయాన్ని సరైన విధంగా వినియోగించుకోవడంతో అనుకున్న దానికన్నా అదనంగా దర్శన సమయం సమకూరడంతో మరింత మంది భక్తులకు సౌకర్యవంతంగా దర్శనం చేయించేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు.
ఈ సమావేశంలో టీటీడీ బోర్డు సభ్యులు నరేష్, శాంతారామ్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## టీటీడీ పాలకమండలికి జంగా కృష్ణమూర్తి రాజీనామా

### రాజీనామాను సిఎం చంద్రబాబుకు చేరవేత

అమరావతి**జనవరి 9 ప్రజావినికిడి** :తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ పాలకమండలి సభ్యత్వానికి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం తన రాజీనామా లేఖను సీఎం చంద్రబాబు నాయుడుకి పంపారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలంటూ ఆ లేఖలో సీఎం చంద్రబాబుకు జంగా కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ పదవికి రాజీనామా చేయడానికి గల కారణాలను ఆ లేఖలో జంగా వివరించినట్లు తెలుస్తోంది. గతంలో తనకు కేటాయించిన బాలాజీనగర్‌లో ప్లాట్ నెంబర్ 2 నేటికీ ఖాళీగానే ఉందని.. దీనిని తనకు కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని కోరారని సమాచారం. దీనిని టీటీడీ బోర్డుకు ప్రభుత్వం పంపడంతో.. ఆమోదముద్ర పడినట్లు తెలుస్తోంది. అయితే గురువారం జరిగిన కేబినెట్ భేటీలో ఈ భూ కేటాయింపును రద్దు



చేసినట్లు సమాచారం. దాంతో ఆయన టీటీడీ సభ్యత్వ పదవికి రాజీనామా చేశారనే ప్రచారం సాగుతోంది. 2024 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీకి జంగా కృష్ణమూర్తి రాజీనామా చేశారు. అనంతరం ఆయన టీడీపీలో చేరారు. ఈ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దాంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం నామినేటెడ్ పోస్టుల భర్తీకి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దాంతో టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడుని నియమించి.. పాలక మండలి సభ్యులుగా పలువురుని నియమించారు. ఆ జాబితాలో జంగా కృష్ణమూర్తికి స్థానం కల్పించారు.
ఇక టీడీపీలో చేరక ముందు జంగా కృష్ణమూర్తి వైసీపీలో ఉన్నారు. పల్నాడులోని గురజాలకు చెందిన ఆయనకు ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ ఎమ్మెల్సీ పదవి కేటాయించారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈయనకు టీటీడీ ఛైర్మన్ పదవి కేటాయిస్తారంటూ ఒక ప్రచారం సాగింది. టీటీడీ ఛైర్మన్ పదవికి వైవీ సుబ్బారెడ్డి రాజీనామా చేసిన తర్వాత ఈ పదవి జంకాను వరిస్తుందని.. చర్చ జరిగింది. కానీ ఆ పదవిని భూమన కరుణాకర్ రెడ్డికి వైఎస్ జగన్ కేటాయించిన విషయం విదితమే. దీంతో ఆయన టిడిపిలో చేరారు.

# ఎప్పటికీ రోహితే నా కెప్టెన్!: ఐసీసీ ఛైర్మన్ జై షా



టీమ్ఇండియా సీనియర్ బ్యాటర్ రోహిత్ శర్మను ఐసీసీ ఛైర్మన్ జై షా 'కెప్టెన్' అని సంబోధించాడు. దీనికి అక్కడున్న రోహిత్ శర్మ కూడా నవ్వులు చిందించాడు. రీసెంట్‌గా రిలయన్స్ ఇండస్ట్రీస్ నిర్వహించిన ఈవెంట్‌లో టీమ్ఇండియా క్రికెటర్లు రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా, హర్మన్ ప్రీత్ కౌర్‌తోపాటు జై షా కూడా పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లో మాట్లాడిన జై షా హిట్‌మ్యాన్‌ను కెప్టెన్ అంటూ పిలిచాడు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. 'మన కెప్టెన్ ఇక్కడే కూర్చొని ఉన్నాడు. అతడు టీమ్ఇండియాకు అతడు రెండు ఐసీసీ ట్రోఫీలు అందించాడు. అందుకే నేను రోహిత్‌ను కేవలం కెప్టెన్ అనే పిలుస్తా. 2023 వరల్డ్‌కప్ టోర్నీలో భారత్ వరుసగా పది మ్యాచ్‌ల్లో నెగ్గింది. కానీ, ఆ టోర్నీలో ట్రోఫీ నెగ్గలేకపోయినా, మన జట్టు అభిమానుల హృదయాలు గెలుచుకుంది. తర్వాత నేను 2024 ఫిబ్రవరిలో రాజ్‌కోట్ వేదికగా ఓ విషయం చెప్పాను. వచ్చే ప్రపంచకప్‌లో ట్రోఫీతోపాటు అభిమానుల హృదయాలను కూడా గెలుచుకోబోతున్నాం' అని ఆ ఈవెంట్‌లో జై షా అన్నారు.ఇక ఇదే ఈవెంట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేష్ అంబానీ సతీమణి నీతా అంబానీ సైతం 2024 టీ20 వరల్డ్‌కప్ గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలోనే రోహిత్ శర్మపై ప్రశంసలు కురిపించారు. రోహిత్ శర్మ జర్నీ గురించి చెబుతూ అతడు యువతకు స్ఫూర్తి అని అన్నారు. 'రోహిత్ చిన్నప్పుడు తన గ్రాండ్ పేరెంట్స్ వద్ద ఉండేవాడు. క్రికెట్ ప్రాక్టీస్ కోసం కిట్‌తో బొరివాలి నుంచి చర్చ్‌గేట్ దాకా లోకల్ ట్రైన్‌లో ప్రయాణించేవాడు. అలా ఒక్కో మెట్టు ఎక్కుతూ టీమ్ఇండియా కెప్టెన్ దాకా ఎదిగిన తీరు అద్భుతం. అలా రోహిత్ భారత క్రికెట్‌లో అత్యుత్తమ ఆటగాళ్లో ఒకడిగా నిలిచాడు. అతడి జర్నీ ప్రపంచానికే స్ఫూర్తి. అతడో ఐకానిక్ల అని నీతా అంబానీ అన్నారు.కాగా, రోహిత్ శర్మ 2021లో టీమ్ఇండియా ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా బాధ్యతలు అందుకున్నాడు. 2022 టీ20 వరల్డ్‌కప్‌లో సెమీస్‌లో భారత్ ఓడింది. కానీ ఆ తర్వాత వరుసగా ఆడిన మూడు ఐసీసీ టోర్నీల్లో భారత్‌ను ఫైనల్‌కు తీసుకెళ్లాడు రోహిత్. అతడి కెప్టెన్సీలోనే టీమ్ఇండియా ఏడాది కాలంలో రెండుసార్లు ఐసీసీ టోర్నమెంట్ ఛాంపియన్‌గా నిలిచింది.అలా భారత్ క్రికెట్ జట్టు దాదాపు 17ఏళ్ల తర్వాత 2024లో టీ20 వరల్డ్‌కప్, అలాగే 8ఏళ్ల తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది రోహిత్ కెప్టెన్సీలోనే. దీంతో భారత్‌కు ఒకటి కంటే ఎక్కువ ఐసీసీ ట్రోఫీలు అందించిన రెండో కెప్టెన్‌గా ధోనీ తర్వాతి స్థానంలో నిలిచాడు. అలా కెప్టెన్‌గా కొంతకాలమే జట్టును నడిపించినప్పటికీ రోహిత్ తనదైన ముద్ర వేశాడు.రోహిత్ సారథ్యంలో 56 వన్డేల్లో భారత్ ఏకంగా 42 విజయాలు సొంతం చేసుకుంది. మరో 12 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ టై కాగా, ఇంకో వన్డేలో ఫలితం తేలలేదు. ఇక టీ20లల్లోనూ రోహిత్ కెప్టెన్సీ రికార్డు ఘనంగానే ఉంది. 62 మ్యాచ్‌ల్లో 49 టీ20ల్లో టీమ్ఇండియా విజయం సాధించింది. టీ20 ఫార్మాట్లో అతడి విన్నింగ్ పర్సంటేజ్ 79.03గా ఉంది.కాగా, 2024 వరల్డ్‌కప్ ఫైనల్ అనంతరం రోహిత్ టీ20లకు గుడ్‌బై చెప్పేశా. ఇక గతేడాది మే నెలలో సుదీర్ఘ ఫార్మాట్ టెస్టులకు కూడా రిటైర్మెంట్ పలికాడు. ప్రస్తుతం అతడు వన్డేల్లోనే ఆడుతున్నాడు. అయితే గతేడాది ఆస్ట్రేలియా సిరీస్‌కు ముందు రోహిత్‌ను బీసీసీఐ కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను మేనేజ్‌మెంట్ వన్డే, టెస్టు ఫార్మాట్‌కు కెప్టెన్‌గా నియమించింది. ఇక టీ20లకు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.



# ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టి వైభవ్ సూర్యవంశీ వైపు

టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ప్రపంచ క్రికెట్ దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు. జింబాబ్వే వేదికగా జరగనున్న అండర్-19 వరల్డ్ కప్ 2026 కోసం భారత జట్టు ఇప్పటికే అక్కడికి చేరుకుంది. జనవరి 15న అమెరికాతో జరిగే మ్యాచ్‌తో భారత్ తన వేటను ప్రారంభించనుంది. అయితే ఈ టోర్నీలో వైభవ్ ఒక భారీ లక్ష్యన్ని తన కళ్లముందు ఉంచుకున్నాడు. అదే మిషన్ 607. ఈ సంఖ్య వెనుక ఉన్న అసలు రహస్యం ఏంటో తెలిస్తే మీరు షాక్ అవుతారు.అండర్-19 వరల్డ్ కప్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక పరుగులు చేసిన రికార్డు ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ ఆయిన్ మోర్గాన్ పేరిట ఉంది. మోర్గాన్ 2004 మరియు 2006లో ఐర్లాండ్ తరపున ఆడి మొత్తం 606 పరుగులు చేశాడు. అయితే వైభవ్ సూర్యవంశీ ఇప్పుడు ఆ రికార్డును అధిగమించి 607 పరుగులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోర్గాన్ ఈ ఘనతను రెండు వరల్డ్ కప్ లలో సాధించగా, వైభవ్ మాత్రం తన అద్భుత ఫామ్‌తో ఈ ఒక్క టోర్నీలోనే ఆ మైలురాయిని చేరుకోవాలని చూస్తున్నాడు. ఇది వినడానికి కష్టంగా అనిపించినా, వైభవ్ బాదుడు చూస్తుంటే అది అసాధ్యమేమీ కాదనిపిస్తోంది.ఇటీవల జరిగిన సౌతాఫ్రికా పర్యటనలో వైభవ్ సూర్యవంశీ చెలరేగిపోయాడు. ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ టీమిండియాకు 3-0తో వన్డే సిరీస్‌ను అందించాడు. బౌలర్ ఎవరైనా సరే ఏమాత్రం కనికరం లేకుండా స్టేడియం బయటకు పంపడమే వైభవ్ స్టైల్. అదే ఊపును ఇప్పుడు వరల్డ్ కప్ లో కూడా కొనసాగించాలని కోరుకుంటున్నాడు. ముఖ్యంగా ఓపెనర్ గా వైభవ్ ఇచ్చే మెరుపు ఆరంభాలు భారత్ కు కొండంత బలాన్ని ఇస్తున్నాయి.వరల్డ్ కప్ మెయిన్ మ్యాచుల కంటే ముందు వైభవ్ రెండు వార్మప్ మ్యాచుల్లో తన సత్తా చాటనున్నాడు. జనవరి 10న స్కాట్లాండ్‌తో, ఆ తర్వాత ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది.

# శ్రీలంక బ్యాటింగ్ కోచ్‌గా విక్రమ్ రాథోడ్



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీకి ముందు శ్రీలంక క్రికెట్ బోర్డు తమ జట్టు కోచింగ్ విభాగాన్ని బలోపేతం చేయడంపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా శ్రీలంక నూతన బ్యాటింగ్ కోచ్‌గా భారత మాజీ బ్యాటింగ్ విక్రమ్ రాథోడ్‌ను నియమించింది. ఇప్పటికే శ్రీలంక ఫీల్డింగ్ కోచ్‌గా భారత మాజీ ఫీల్డింగ్ కోచ్ ఆర్ శ్రీధర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా విక్రమ్ రాథోడ్ ఈ జాబితాలో చేరాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచిన భారత జట్టులో విక్రమ్ రాథోడ్, ఆర్ శ్రీధర్ భాగంగా ఉన్నారు. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తున్న విక్రమ్ రాథోడ్ జనవరి 15న శ్రీలంక జట్టులో బ్యాటింగ్ కోచ్‌గా చేరనున్నాడు. విక్రమ్ రాథోడ్ 2019 నుంచి 2024 వరకు భారత జట్టు బ్యాటింగ్ కోచ్‌గా సేవలందించాడు. ఆ సమయంలో భారత్ వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్ చేరడంతో పాటు ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2024 గెలిచింది.ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8వరకు భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న సంగతి తెలిసిందే. శ్రీలంక తమ లీగ్ మ్యాచ్‌లను సొంతగడ్డపైనే ఆడనుంది. ఈ క్రమంలోనే శ్రీలంక క్రికెట్ బోర్డు భారత కోచ్‌లకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది



# సెమీఫైనల్లో పీవీ సింధు..

గాయం నుంచి కోలుకొని కొత్త సీజన్‌లో తొలి టోర్నీ బరిలోకి దిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు దుమ్మురేపుతోంది. మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీలో సింధు సెమీఫైనల్ చేరింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ మధ్యఅబశ్రీశ్రీలోనే జపాన్ ప్లేయర్ అకానే యమగుచి గాయంతో తప్పుకోవడంతో సింధు సెమీస్‌కు దూసుకెళ్లింది. యమగుచి ఆట నుంచి తప్పుకోవడానికి ముందు సింధు 21-11తో తొలి గేమ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో ప్రపంచ మూడో ర్యాంకర్ యమగుచితో ముఖాముఖి పోరును 15-12తో 18వ ర్యాంకర్ సింధు మెరుగుపర్చుకుంది. శనివారం జరిగే సెమీఫైనల్లో చైనా షట్లర్, రెండో సీడ్ వాంగ్ జియితో సింధు తలపడనుంది. ఈ టోర్నీ తొలి రౌండ్‌లో సింధు 21-14, 22-20తో సుంగ్ షువో యున్(చైనీస్ తైపీ)పై విజయం సాధించింది. ప్రిక్వార్టర్స్‌లో సింధు 21-8, 21-13తో ప్రపంచ 9వ ర్యాంకర్ టొమోకా మియజకి(జపాన్)ను ఓడించింది. కేవలం 33 నిమిషాల్లోనే ఈ మ్యాచ్‌ను సింధు ముగించడం విశేషం. క్వార్టర్ ఫైనల్లో యమగుచి గాయం సింధుకు కలిసొచ్చింది.పురుషుల డబుల్స్ లో భారత ద్వయం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి పోరాటం క్వార్టర్స్‌లో ముగిసింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 10-21, 21-23 తేడాతో ఎమ్ఎస్ ఫిక్రి-ఎఫ్ అల్‌ఫియాన్ జోడి చేతిలో ఓటమిపాలైంది.

# రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర శతకం



న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు ఎంపికవ్వని రుతురాజ్ గైక్వాడ్.. తన బ్యాట్‌తోనే సెలెక్టర్లకు సమాధానమిచ్చాడు. విధ్వంసకర శతకంతో చెలరేగి వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. 'నీ అవ్వ నన్నే తప్పిస్తారా' అని బౌలర్లను శతక్కొట్టాడు. విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా గురువారం గోవాతో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ విధ్వంసకర సెంచరీతో అరాచకం సృష్టించాడు. తద్వారా లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగంగా 20 శతకాలు నమోదు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో అతను విరాట్ కోహ్లీ, బాబర్ ఆజామ్ ఆల్‌టైమ్ రికార్డ్‌లను బద్దలుకొట్టాడు.శ్రేయస్ అయ్యర్, శుభ్‌మన్ గిల్ గాయాల నేపథ్యంలో సుదీర్ఘ విరామం తర్వాత టీమిండియా పిలుపును అందుకున్న రుతురాజ్ గైక్వాడ్.. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో నాలుగో స్థానంలో బరిలోకి దిగాడు. తొలి వన్డేలో విఫలమైనా..రెండో వన్డేలో సెంచరీతో చెలరేగాడు. మూడో వన్డేలో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. అయితే గిల్, అయ్యర్ అందుబాటులోకి రావడంతో న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ నుంచి రుతురాజ్ ఉద్వాసనకు గురయ్యాడు.ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. రాబిన్ ఊతప్ప అయితే.. భారత సెలెక్టర్లపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ముంబై, ఢిల్లీ, పంజాబ్ ఆటగాళ్లకే భారత జట్టులో సుస్థిరం స్థానం ఉంటుందని, రుతురాజ్‌కు అన్యాం జరిగిందని మండిపడ్డాడు.



# కెండ్రా లస్ట్‌తో విరాట్ కోహ్లీ..

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అతనికి భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. శత్రు దేశం పాకిస్థాన్‌లోనూ కోహ్లీ అంటే పడి చచ్చే అభిమాన గణం ఉంది. దాంతో కోహ్లీ తరుచూ వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. అయితే తాజాగా కెండ్రా లస్ట్ అనే అమెరికా శృంగార తార.. సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీతో ఉన్న ఫోటోను పంచుకోవడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. అనుకోకుండా టీమిండియా స్టార్ విరాట్ కోహ్లీని యూకేలో కలిసానని కెండ్రా లస్ట్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఓ ఫోటోను పంచుకుంది. ఈ పోస్ట్‌కు కెండ్రా లస్ట్.. 'అనుకోకుండా జరిగే సమావేశాలు ఎప్పుడూ అత్యుత్తమంగా ఉంటాయి. ఎంత గొప్ప స్ఫూర్తి, నిజంగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తి'అనే క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫొటో క్షణాల్లో వైరల్ కాగా.. ఇది ఫేక్ అంటూ అభిమానులు తేల్చేసారు. ఏఐ జనరెటేడ్ ఫొటో అని కామెంట్ చేస్తున్నారు. విరాట్ కోహ్లీ కుటుంబం లండన్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకున్నప్పటికీ.. గత నెలరోజులుగా భారత్‌లోనే ఉన్నాడు. దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీ ఆడేందుకు భారత్‌కు వచ్చిన కోహ్లీ.. అప్పటి నుంచి ఇక్కడే ఉంటూ న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ కోసం సిద్ధమవుతున్నాడు. అలాంటిది కోహ్లీని యూకేలో కెండ్రా లస్ట్ ఎలా కలిసిందని ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. ఈ మధ్య కెండ్రా లస్ట్ తరుచూ ఏఐ జనరేటేడ్ ఫొటోలను పంచుకుంటుంది. ఇటీవల భారత బాలీవుడ్ సూపర్ స్టార్స్ సల్మాన్ ఖాన్, షారూఖ్ ఖాన్‌ను కలిసినట్లు ఏఐ జనరేటెడ్ ఫొటోలను సోషల్ మీడియా వేదికగా పంచుకొని వార్తల్లో నిలిచింది. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నాడు. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్న విరాట్ కోహ్లీ.. తనకు అచ్చొచ్చిన ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్నాడు. ఆదివారం వడోదర వేదికగా జరిగే తొలి వన్డేతో మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఢిల్లీ తరపున రెండు మ్యాచ్‌లు ఆడిన కోహ్లీ సెంచరీ, హాఫ్ సెంచరీ( 131, 77)తో రాణించాడు. సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో వరుసగా రెండు సెంచరీలు బాది 302 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక





# డ్రగ్స్ కేసులో నవదీప్ కు భారీ ఊరట

డ్రగ్స్ కేసులో నటుడు నవదీప్‌కు పెద్ద ఊరట లభించింది. ఆయనపై నమోదైన డ్రగ్స్ కేసును తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. గుడిమల్కాపూర్‌లో నమోదైన ఈ కేసులో నవదీప్ వద్ద ఎలాంటి మత్తుపదార్థాలు దొరకలేదన్న అంశాన్ని కోర్టు స్పష్టంగా గుర్తించింది.
నవదీప్ తరఫున వాదనలు వినిపించిన అడ్వొకేట్ వెంకట సిద్ధార్థ్ మాట్లాడుతూ.. ఈ కేసులో నవదీప్ పేరు కేవలం ఎఫ్ఐఆర్ లో మాత్రమే ఉందని, సంఘటన జరిగిన ప్రదేశంలో ఆయన వద్ద డ్రగ్స్ ఏవీ లభించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. స్పాట్‌లో స్వాధీనం చేసుకున్న వస్తువుల్లో నవదీప్‌కు సంబంధించిన ఆధారాలు లేవని వివరించారు.
ఈ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు.. సరైన ఆధారాలు లేకుండా కేసు కొనసాగించడం సరికాదని పేర్కొంది. నవదీప్ వద్ద డ్రగ్స్ లభించనందున, ఆయనపై నమోదైన కేసును కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నవదీప్‌కు చట్టపరంగా పెద్ద ఊరట లభించినట్టయింది.

# ఫర్వాలేదనిపించుకున్న రాజా సాబ్

బాహుబలి తర్వాత లార్జర్ దేన్ లైఫ్ తరహా సినిమాలతోనే ప్రయాణం చేస్తున్నారు ప్రభాస్. ఫ్యాన్స్ ఆయనను వింటేజ్ డార్లింగ్ లుక్ లో చూసి చాలా కాలమైయింది. ఆ లోటుని భర్తీ చేసే సినిమా 'రాజాసాబ్' అని స్వయంగా డైరెక్టర్ మారుతి చెప్పడం, కెరీర్ లో తొలిసారి ప్రభాస్ ఒక హారర్ ఫాంటసీ స్జబెక్ట్ ని ఎంచుకోవడం, ప్రచార చిత్రాలు ఆసక్తిని రేపడం, సంక్రాంతి రేసులో తొలి సినిమాగా రావడంతో మంచి హైప్, అంచనాలు ఏర్పడాయి. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి అల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ. నాయనమ్మకి జరిగిన




అన్యాయానికి ప్రతీకారం తీర్చుకున్న మనవడి కథ ఇది. ఒక హారర్ ఫాంటసీ సరిపడే ముడిసరకు ఈ కథలో పుష్కలంగా వుంది. హిప్నాటిజంతో పాటు తాంత్రిక విద్యలు తెలిసిన విలన్ ని తన మనోబలంతో హీరో ఎలా జయించాడనే పాయింట్ బలమైనదే. కాకపోతే ఇందులో సంఘర్షణ, సన్నివేశాలు, కథనం అల్లిన తీరు ఇంకా ప్రభావవంతంగా ఉండాల్సింది. సత్య పాత్ర రాజ్ మహల్ ప్రవేశం, అక్కడ జరిగిరే సన్నివేశాలు థ్రిల్లింగ్ ఫీలింగ్ కలిగిస్తూ సినిమా కథ మొదలౌతుంది. ఈ సీక్వెన్స్ రాజాసాబ్ పై అంచనాలు పెంచుతుంది. రాజు పాత్రలో ప్రభాస్ ఎంట్రీ ఆ తర్వాత వచ్చే పాట వింటేజ్ డార్లింగ్ ని గుర్తు చేస్తుంది. తర్వాత తాతని వెదికే క్రమంలో వచ్చే సన్నివేశాలు సాదాసీదాగా సాగుతాయి. హీరోయిన్స్ ట్రాక్స్ సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. రాజు పాత్ర మహల్ లోకి ఎంట్రీ ఇస్తేనే అసలు కథ మొదలౌతుంది. కాకపోతే ఆ ఘట్టానికి రావడానికి ఇంటర్వెల్ వరకూ ఎదురుచూసేలా చేశారు. దీంతో అప్పటివరకూ సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది.కనకరాజు పాత్రలో సంజయ్ దత్ చేసే హిప్నటిజం ఆడియన్స్ కి ఇంకా బలంగా రిజిస్టర్ చేయాల్సింది. బోమన్ ఇరానీ పాత్ర వచ్చే వరకూ చాలా విషయాలు కన్ఫ్యూజన్ లోనే వుంటాయి. అలాగే ఆ మహల్ ప్రవేశించిన పాత్రలు పెద్ద సవాళ్లు ఎదురుకావు. కామెడీ కూడా సరిగ్గా వర్క్ అవుట్ కాలేదు. దీంతో ఆడియన్స్ కి జరుగుతున్న సంఘటనలపై ఆసక్తి తగ్గుతుంది. కాకపోతే ప్రీక్లైమాక్స్ క్లైమాక్స్ సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఆ సన్నివేశాలు ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. ప్రభాస్ మళ్ళీ వింటేజ్ లుక్ లో చూడటం ఆయన ఫ్యాన్స్ ని ఖుషి చేస్తుంది. చాలా కాలం తర్వాత ఫన్ బాడీ లాంగ్వేజ్, ÷ట్స్, డ్యాన్సులు.. ఇలా కలర్ ఫుల్ అవతార్ లో కనిపించారు. సంజయ్ దత్ పర్సనాలిటీ ఆ క్యారెక్టర్ కి ప్లస్ అయ్యింది. కాకపోతే ఆ పాత్రని ఇంకా బలంగా రాయాల్సింది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ తెరపై అందంగా కనిపించారు. అయితే ఆ పాత్రలు కథలో మిళితం కాలేదు. జరీనా వాహెబ్ తన అనుభవం చూపించారు. వీటీవీ గణెళిష్, సప్తగిరి, ప్రభాస్ శ్రీను, సత్య.. అక్కడక్కడ నవ్వించారు.

# చీరకట్టులో యాక్షన్..

## సమంత కొత్త సినిమా టీజర్

కొంతకాలంగా వెండితెరకు దూరంగా ఉన్న స్టార్ హీరోయిన్ సమంత, పూర్తిస్థాయి యాక్షన్ అవతార్‌తో గ్రాండ్ రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' టీజర్‌ను చిత్ర యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. ఈ టీజర్‌లో సమంత మునుపెన్నడూ చూడని రగ్డ్, సీరియస్ లుక్‌తో, చీరకట్టులో బస్సులో ఫైట్ చేస్తున్న సన్నివేశాలు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తున్నాయి. దీంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను భారీగా పెంచుతోంది.'మా ఇంటి బంగారం' అనే టైటిల్ వినడానికి సున్నితమైన కుటుంబ కథ చిత్రంగా అనిపించినా, టీజర్ చూశాక ఇది పక్కా యాక్షన్ థ్రిల్లర్ అని స్పష్టమవుతోంది. సమంత కెరీర్‌లో ఇది ఒక భిన్నమైన ప్రయత్నంగా నిలవనుంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ హిట్ చిత్రం 'ఓ బేబీ' తర్వాత దర్శకురాలు నందిని రెడ్డితో సమంత చేస్తున్న రెండో సినిమా కావడంతో సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి సమంత సహ నిర్మాతగా వ్యవహరించడం మరో విశేషం.త్రలాల మూవీంగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరుతో కలిసి సమంత ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'కాంతారా' ఫేమ్ గుల్షన్ దేవయ్య, కన్నడ నటుడు దిగంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు సంతోశ్ నారాయణన్ సంగీతం అందిస్తుండగా, ఆయన నేపథ్య సంగీతం యాక్షన్ సన్నివేశాలకు మరింత బలాన్ని చేకూర్చనుంది.ఇప్పటికే 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్ల వంటి వెబ్ సిరీస్‌లలో యాక్షన్ పాత్రలతో మెప్పించిన సమంత, ఈ సినిమాలో డూప్ సహాయం లేకుండా సొంతంగా స్టంట్స్ చేస్తున్నట్లు సమాచారం. సుదీర్ఘ విరామం తర్వాత పూర్తిస్థాయి కథనాయిక ప్రాధాన్యమున్న చిత్రంతో సమంత వస్తుండటంతో, అభిమానులు ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# జన నాయగన్ కు ఊరట

## సెన్సార్ ఇవ్వాలని మద్రాస్ హైకోర్టు ఆదేశం



విజయ్ కథానాయకుడిగా నటించిన 'జన నాయగన్' సినిమాకు ఊరట లభించింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డుకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం తీర్పు వెలువరించింది. గత డిసెంబరులో సెన్సార్ కోసం జన నాయగన్ సినిమాను పంపగా అభ్యంతరకర మైన సన్నివేశాలు తొలగించాలని, కొన్ని సంభాషణలు మ్యూట్ చేయాలని సూచించినట్లు సమాచారం. ఆ మేరకు మార్పులు చేసిన నిర్మాణ సంస్థ మళ్లీ సెన్సార్‌కు పంపగా బోర్డు నుంచి స్పందన రాలేదు. ఈ నేపథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్ తరఫున మద్రాసు హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలైంది. తొలుత యూ/ఏ సర్టిఫికేషన్‌కు సిఫార్సు చేసిన సెన్సార్ బోర్డు.. ఆ తర్వాత సినిమాను రివ్యూ కమిటీకి పంపిందని నిర్మాణ సంస్థ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై వాదనలు విన్న హైకోర్టు బుధవారం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో జనవరి 9న విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడింది. తాజాగా ఈ అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. సినిమాకు సర్టిఫికెట్ ఇచ్చిన తర్వాత మళ్లీ రివ్యూ కమిటీకి పంపాల్సిన అవసరం ఏంటని న్యాయమూర్తి ప్రశ్నించారు. ముందుగా ఇస్తామన్న యూ/ఏ సర్టిఫికెట్ తక్షణమే ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సింగిల్ జడ్జి తీర్పుపై సెన్సార్ బోర్డు అప్పీల్ చేసింది. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ ధర్మాసనం ముందు అత్యవసర విచారణ కోసం రిట్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే, తాజా తీర్పుతో 'జననాయగన్' విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ క్రమంలోనే సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోన్నట్లు

# ఆస్కార్ రేసులో ఇండియన్ ఫిలిమ్స్

## ముందున్న కాంతారా, మహావతార్ నరసింహ


సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 98వ ఆస్కార్ అవార్డుల సందడి మొదలైంది. అంతర్జాతీయ వేదికపై అప్పుడే మొదలైంది. తాజాగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ విడుదల చేసిన 'రిమైండర్ లిస్ట్'లో భారత్ నుండి ఏకంగా నాలుగు చిత్రాలు చోటు దక్కించుకుని సంచలనం సృష్టించాయి. మొత్తం 201 చిత్రాలతో కూడిన ఈ జాబితాలో నిలిచిన సినిమాలు 'ఉత్తమ చిత్రం' కేటగిరీలో పోటీ పడేందుకు అర్హత సాధించాయి. ఇందులో రిషబ్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన కన్నడ బ్లాక్ బస్టర్ 'కాంతార: ఎ లెజెండ్ చాప్టర్ 1' గ్లోబల్ స్థాయిలో తన పట్టు నిలుపుకోగా, అనుపమ్ ఖేర్ దర్శకత్వం వహించిన హిందీ చిత్రం 'తన్వి ది గ్రేట్' ఆస్కార్ రేసులో నిలిచి అందరినీ షాక్‌కి గురిచేసింది. ఇక వీటితో పాటు భారతీయ పురాణ నేపథ్యంలో వచ్చిన బహుభాషా యానిమేషన్ చిత్రం 'మహావతార్ నరసింహ', నూతన దర్శకుడు అభిషన్ జీవింత్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'టూరిస్ట్ ఫ్యామిలీ' కూడా ఈ అర్హత జాబితాలో చోటు దక్కించుకున్నాయి. రాధికా ఆప్టే నటించిన 'సిస్టర్ మిడ్‌నైట్' సైతం ఈ పోటీలో ఉండటం విశేషం. మరోవైపు భారత్ నుంచి అధికారికంగా పంపబడిన నీరజ్ ఘైవాన్ చిత్రం 'హోమ్‌బౌండ్' ఇప్పటికే 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్' కేటగిరీలో టాప్-15 షార్ట్‌లిస్ట్‌లో నిలిచి భారీ ఆశలు రేకెత్తిస్తోంది.



ఆస్కార్ నిబంధనల ప్రకారం.. ఈ చిత్రాలన్నీ 2025లో అమెరికాలోని ప్రధాన మెట్రోపాలిటన్ ఏరియాల్లో కనీసం ఏడు రోజులు థియేటర్లలో ప్రదర్శితమై ఉండటంతో పాటు ఆస్కార్ అకాడమీ సూచించిన 'ఇన్‌క్లూజన్ స్టాండర్డ్స్' ప్రమాణాలను విజయవంతంగా పూర్తిచేశాయి. అయితే ఈ జాబితాలో ఉన్నంత మాత్రాన నామినేషన్ దక్కినట్లు కాదని, అకాడమీ సభ్యుల రహస్య ఓటింగ్ పక్రియ తర్వాతే అసలు విజేతలు ఎవరో తెలుస్తుందని గుర్తుంచుకోవాలని సినీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ఈ ఉత్కంఠకు తెరదించుతూ 2026 జనవరి 22న తుది నామినేషన్ల జాబితాను అకాడమీ ప్రకటించనుంది. ఇక ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఎంతగానో ఎదురుచూసే 98వ ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవ వేడుక మార్చి 15న లాస్ ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లో వైభవంగా జరగనుంది.

# శివకార్తికేయన్ పరాశక్తి నేడు విడుదల

శివకార్తికేయన్ హీరోగా, సుధా కొంగర దర్శకత్వంలో రూపుదిద్దుకున్న భారీ బడ్జెట్ చిత్రం 'పరాశక్తి' ఎట్టకేలకు సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు తాజాగా సర్టిఫికేట్‌ను జారీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ సినిమా 1960ల నాటి హిందీ వ్యతిరేక ఉద్యమ నేపథ్యం ఉన్నందున, తొలుత సెన్సార్ బోర్డు 23 కట్స్ సూచించినప్పటికీ, రివైజింగ్ కమిటీ పరిశీలన తర్వాత కొన్ని మార్పులతో క్లియరెన్స్ లభించింది. సుమారు 162 నిమిషాల నిడివి ఉన్న ఈ పీరియాడిక్ పొలిటికల్ డ్రామాలో శివకార్తికేయన్ కాలేజీ విద్యార్థిగా కనిపించనున్నారు. ఈ సినిమా తమిళ వెర్షన్ సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అయితే తెలుగులో సంక్రాంతి సినిమాల రద్దీ మరియు థియేటర్ల లభ్యత తక్కువగా ఉన్న కారణంగా, తెలుగు వెర్షన్ విడుదలను జనవరి 23కి వాయిదా వేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జయం రవి, అథర్వ మురళి కీలక పాత్రలు పోషించారు. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్‌కు ఇది 100వ సినిమా కావడం విశేషం.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613